# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం 14 డిసెంబర్ 2024 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 12




## అల్లు అర్జున్ అరెస్ట్‌తో
# చిత్ర పరిశ్రమ షాక్

వివరాలు 2లో

**షూటింగ్ రద్దు చేసుకుని**
**అల్లు ఇంటికి మెగా బ్రదర్స్**

అల్లు అర్జున్ అరెస్టుతో ఒక్కసారిగా సినిమా పరిశ్రమల్రో కుదుపు వచ్చింది. ఆయన అరెస్టు అయిన సంగతి తెలుసుకున్న వారంతా స్పందిస్తున్నారు.

– హైదరాబాద్, నినాదం న్యూస్



## భూదాన్ భూముల వ్యవహారంలో
# నలుగురికి
# ఈడీ నోటీసులు

భూదాన్ భూముల వ్యవహారంలో ఓ మాజీ ఎమ్మెల్యే సహా నలుగురుకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలంటూ అందులో పేర్కొంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను ఈడీ ఇప్పటికే విచారించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్, డిసెంబర్ 13 (నినాదం న్యూస్): తాజాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేతో పాటు వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డి, మరో ఇద్దరికి నోటీసులు ఇచ్చింది. ఐఏఎస్ అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ రెవెన్యూ పరిధిలోని 17వ సర్వే నంబర్‌లో 386 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత అన్యాక్రాంతమైనట్టు ఆరోపణలు వచ్చాయి. ఇదే సర్వేనంబర్‌లోని ప్రైవేట్ భూమి 26 ఎకరాల్లో మెరుగు గోపాల్ యాదవ్ వెంచర్ వేసి సీలింగ్ ల్యాండ్‌ను కూడా కలుపుకున్నాడు. అయితే తమ భూమిలో గోపాల్ యాదవ్ వెంచర్ వేశాడని పలువురు రైతులు ఆరోపిస్తూ అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నామని, తమ పేరిట పట్టాలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఈ వ్యవహారంపై నిగ్గుతేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగింది.



### తొక్కిసలాట ఘటనలో
# అల్లు అర్జున్ అరెస్ట్
**సీపీ ఆనంద్**

అల్లు అర్జున్ అరెస్ట్ అవడం సంచలనంగా మారింది. ఈ ఘటనపై హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు.

2లో



### అల్లుఅర్జున్ అరెస్ట్
# అప్రజాస్వామికం
**కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి**

సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన తీరు సరైనది కాదని మండిపడ్డారు.



## చేసే పనులన్నీ చేసి అధికారులను
# బలిపశువు చేస్తున్నారు

**రేవంత్‌రెడ్డి నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయింది**

**రైతులంటే కాంగ్రెస్‌కు గౌరవం లేదు**

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 13 (నినాదం న్యూస్): రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని, అందుకే దాడులు, అక్రమ అరెస్టు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. నీ నిజ స్వరూపం మిగతా2లో



వివరాలు 2లో

## సీఎం సహాయనిధితో
# పేదలకు లబ్ధి

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



# అల్లు అర్జున్ అరెస్ట్‌తో చిత్ర పరిశ్రమ షాక్

## షూటింగ్ రద్దు చేసుకుని అల్లు ఇంటికి మెగా బ్రదర్స్

**హైదరాబాద్, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** అల్లు అర్జున్ అరెస్టుతో ఒక్కసారిగా సినిమా పరిశ్రమల్రో కుదుపు వచ్చింది. ఆయన అరెస్టు అయిన సంగతి తెలుసుకున్న వారంతా స్పందిస్తున్నారు. మరోవైపు మెగా స్టార్ చిరంజీవి తన షూటింగ్స్ రద్దు చేసుకున్నారు. విశ్వంభర షూటింగ్‌లో ఉన్న మెగాస్టార్ చిరంజీవి సెట్ నుంచి నేరుగా అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్నారు. మొదట హాస్పిటల్‌కు, లేక నాంపల్లి కోర్టుకు వస్తారని ప్రచారం జరిగింది. అల్లు అర్జున్ ను వైద్య పరీక్షల కోసం గాంధీ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. అదే సమయంలో ఇటు చిరంజీవి తన షూటింగ్ రద్దు చేసుకుని అల్లు అర్జున్ ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మెగా బ్రదర్ నాగబాబు కూడా అల్లు అర్జున్ నివాసానికి చేరుకున్నారు. చిరంజీవి, నాగబాబు ఇద్దరూ అల్లు అర్జున్ కుటుంబసభ్యులతో సమావేశం అయ్యారు.

# సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**మహేశ్వరం, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ తన కార్యాలయంలో కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీకి చెందిన రామావత్ కిషన్ అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంతో కార్పొరేట్ హాస్పిటల్ లో ఆపరేషన్ చేయించుకున్నారు. ఎమ్మెల్యే ను సంప్రదించగా సీఎం రిలీఫ్ ఫండ్ ఆపరేషన్ సంబంధించిన బిల్లును ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం జరిగింది. దానికి గాను వారికి రూ. 2 లక్షల 15 వేలు మంజూరు చేయడం జరిగింది. చెక్కును ఎంపీ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... పేదల ఆరోగ్యం పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని అన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో నిరంతరం శ్రమిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏదో సహాయంగా ప్రతి నిరుపేదకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కృషి ఫలితమే తెలంగాణ రాష్ట్రం ప్రపంచ దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు ఎక్కడ లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలోని దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు సభ్యులు యువకులు పాల్గొన్నారు.

# చేసే పనులన్నీ చేసి అధికారులను బలిపశువు చేస్తున్నారు

**(మొదటిపేజీ తరువాయి..)**

రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. భూమి ఇయ్యను అన్నందుకు గిరిజన రైతులను జైలు లో పెట్టడం ఓకేనట.. జైలులో వారిని చిత్రహింసలు పెట్టడం ఓకేనట.. వారి కుటుంబసభ్యులను అర్ధరాత్రి ఇండ్ల మీద దాడిచేసి భయపెట్టడం, బెదిరించడం ఓకేనట.. నెల రోజులుగా వారికీ చెయ్యని నేరానికి బెయిల్ కూడా రాకుండా అడ్డుపడటం ఓకేనట.. గుండె జబ్బుతో ఉన్న పేషెంటుకు బేడీలు వేయించటం కూడా ఓకేనట అని కేటీఆర్ విమర్శించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇకనైనా క్షమాపణలు చెప్పి కేసులు రద్దు చేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గుండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గుండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గుండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో వైద్యులు అశోక్, మజీద్‌ఖాన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయగా ఆసమయంలోనూ రైతుకు బేడీలు తీయలేదు. పరీక్షలు ముగిసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించాలని సూపరింటెండెంట్, వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. హీర్యానాయక్ చాలారోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. 2డీ ఈకో పరీక్ష చేయగా గుండె బలహీనంగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. సంగారెడ్డిలో కాథల్యాబ్ లేనందున నిమ్స్‌కు రిఫర్ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. అండర్ ట్రయల్‌లో ఉన్న ఖైదీలకు సంకెళ్లు వేయవద్దని గతంలో కోర్టులు చెప్పినా అవేమీ పట్టించుకోండా కంది సెంట్రల్ జైలు పోలీసులు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించటం తీవ్ర విమర్శలకు దారితీసింది. జైలు అధికారుల తీరును గిరిజన, రైతు సంఘాలు తీవ్రంగా ఖండిరచాయి.

# ఇవి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కాదు...

- ఈవీఎం ప్రభుత్వాలు
- ఎంపీ సంజయ్‌రౌత్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఉద్ధవ్ థాకరే శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర విమర్శలు చేశారు. జమిలి ఎన్నికల నిర్వహణపై సరైన పరిశోధన, సరైన సవరణలు జరగలేదని రౌత్ వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక ప్రధాని నరేంద్రమోదీ 2029 వరకు పదవిలో కొనసాగుతాడనే నమ్మకం తనకు లేదని అన్నారు. 'జమిలి ఎన్నికలకు సంబంధించి సరైన సవరణలు, పరిశోధన జరగలేదు. ప్రధాని ఎప్పుడూ తన మనసులోని మాటలు చెబుతుంటాడు. కానీ ప్రజల మనసులో ఏముంది..? ప్రతిపక్షాల మనసులో ఏముంది..? అనే విషయాలను గురించి ఆయన ఆలోచించరు. మోదీ 2029 వరకు ప్రధానిగా కొనసాగుతారనేది నాకు అనుమానమే. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పు. కేంద్రంలో, మహారాష్ట్రలో ఏర్పాటైన మీ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కావు. అవి ఈవీఎంల ద్వారా ఏర్పాటైన ప్రభుత్వాలు' అని రౌత్ వ్యాఖ్యానించారు. మరోవైపు పలువురు కాంగ్రెస్ ఎంపీలు కూడా జమిలి ఎన్నికలపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అవకతవకలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలు జరగడంవల్ల ఎన్నికల ఖర్చు భారీగా తగ్గిపోయి దేశ జీడీపీ 1.5 వరకు పెరిగే ఛాన్స్ ఉందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ చెప్పడాన్ని కొందరు కాంగ్రెస్ ఎంపీలు తప్పుపట్టారు.

## తొక్కిసలాట ఘటనలో

# అల్లు అర్జున్ అరెస్ట్: సీపీ ఆనంద్

**హైదరాబాద్,డిసెంబర్13 (నినాదం న్యూస్):** పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్ అవడం సంచలనంగా మారింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బన్నీని అదుపులోకి తీసుకొని చిక్కడపల్లి పీఎస్‌కు తరలించారు పోలీసులు. ఈ ఘటనపై హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు. ఆయన సంధ్య థియేటర్‌కు రావడం వల్లే అక్కడ తొక్కిసలాట జరిగిందని స్పష్టం చేశారు. అల్లు అర్జున్‌ను కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు.

# అల్లుఅర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

- కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి



**న్యూఢిల్లీ, డిసెంబర్13 (నినాదం న్యూస్):** సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన తీరు సరైనది కాదని మండిపడ్డారు. నేరుగా బెడ్‌రూంలోకి వచ్చి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ భారత సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని బండి సంజయ్ తెలిపారు. అలాంటి వ్యక్తితో కాస్త మర్యాదగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడ్డారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడం నిజంగా విచారకరమని తెలిపారు. కానీ ఆ తొక్కిసలాట పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని ఆరోపించారు. పుష్ప ది రైజ్ ఘన విజయం తర్వాత పుష్ప 2కి విపరీతమైన క్రేజ్ వచ్చిందని.. ఆ సినిమా విరీద భారీ అంచనాలు ఏర్పడ్డాయని బండి సంజయ్ తెలిపారు. అలాంటి సమయంలో ఏర్పాటు చేసిన ఈవెంట్‌కు సరైన ఏర్పాట్లు చేయకపోవడం నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని చెప్పారు. ఈ ఘటనలో అల్లు అర్జున్‌ను నేరస్తుడిగా చూడొద్దని.. ఆయనకు కనీస గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో అల్లు అర్జున్‌ను ఇవాళ మధ్యాహ్నం చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా సుమారు రెండు గంటల పాటు అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. బన్నీ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం చిక్కడపల్లి పీఎస్ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీని తర్వాత నాంపల్లి కోర్టుకు తీసుకెళ్లారు. కాగా, అల్లు అర్జున్ అంశంలో చట్ట ప్రకారం ఫాలో అవుతున్నామని పోలీసులు తెలిపారు.

# విద్యార్థి దశనుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి




**● వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

**విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**

**చేవెళ్ల, డిసెంబర్ 13( నినాదం న్యూస్):** విద్యార్థి దశ నుంచి భవిష్యత్తు లక్ష్యాలను ఉంచుకొని ఉన్నత రంగాలలో రాణించాలని తాళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, సర్దార్ నగర్ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ శ్రీ లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని తాళ్ళ పల్లి, జిల్లా పరిషత్ స్కూల్, సర్దార్ నగర్ స్కూల్స్ లో వెల్స్ వన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన, పరిశుభ్రత,వివిధ రకాల నైపుణ్యాలను, కెరియర్ కు అవసరమైనటువంటి సూచనలు, సలహాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆధునిక ప్రపంచంలో ముందుకు వెళ్లడానికి అవసరమైనటువంటి ఏంట్రా ప్రీనూయర్ లక్షణాలు, పర్సనాలిటీ డెవలప్మెంట్ గ్రూప్ డిస్కషన్, ప్రజెంటేషన్ స్కిల్ డెవలప్మెంట్ సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు దాదాపు 140 మంది హాజరు అయినారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య గారు కెరీర్ గైడెన్స్ ట్రైనర్ మహేష్ కుమార్ గారు మరియు ప్రిన్సిపల్ దేషన్ బీసీఐ మేనేజర్ పవన్ కుమార్, శిరీష టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైడ్రాతో స్థానికుల్లో ఆందోళన

**● చావులకు రేవంత్‌రెడ్డి బాధ్యుడు : కేటీఆర్**



**హైదరాబాద్, డిసెంబర్ 13 ( నినాదం న్యూస్):** మూసీ పరివాహక ప్రాంతంలో కూల్చివేతల భయంతో ఆటో డ్రైవర్ రవీందర్ హఠాన్మరణం చెందిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చావుకు కారణం నువ్వు.. నీ హైడ్రా బుల్డోజర్లు కారణం కాదా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. హైడ్రాతో పేదల్లో భయం నింపింది.. పేదల గూడులను కూల్చమన్నది నువ్వు కాదా అని నిలదీశారు. డీపీఆర్ లేదంటూనే ఇళ్ల మీద మార్కింగ్‌లు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది నువ్వు కాదా అని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. బుచ్చమ్మ అకాల మరణానికి బాధ్యుడివి నువ్వే.. రవీందర్ గుండెను ఆపింది నీ హైడ్రా బుల్డోజర్లే అని మండిపడ్డారు. అమాయకులను బలితీసుకుని.. వారి బతుకులను ఛిద్రం చేసి, వాళ్ల కుటుంబాలను చిన్నాభిన్నం చేసి, వారి గుండెలను ఆపేసిందన్నారు. తన ఇంటిని కూల్చివేస్తారని దిగులు చెందిన ఆటోడ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన రామంతాపూర్‌లో చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. రామంతాపూర్ లక్ష్మీనారాయణకాలనీకి చెందిన రవీందర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూసీ కూల్చివేతల్లో భాగంగా తమ ఇంటిని కోల్పోతామని కొద్దిరోజులుగా దిగాలుగా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రోజూ మాదిరిగానే గురువారం నాగోల్ నుంచి ఇంటికి వస్తుండగా గుండెపోటు రావడంతో రవీందర్ మృతిచెందాడు. తన ఇంటిని కూల్చివేస్తారనే ఆవేదనతోనే మరణించినట్టు కుటుంబసభ్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుండెపోటుతో రవీందర్ మృతి చెందిన విషయం సోషల్ మీడియాతోపాటు స్థానిక గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది.

# ప్రజా సమస్యలపై పోరాడే ఫార్ములే కేటీఆర్

**● బాల్కసుమన్**



**హైదరాబాద్, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** ప్రజా సమ్యస్యల మీద పోరాడే పోరాట ఫార్ములే కేటీఆర్ అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆశా కార్యకర్తల్కైన, ఆడబిడ్డల మీద, గురుకుల పసిబిడ్డల ఫుడ్ పాయిజనింగ్ మీద స్పందించి సర్కార్ మెడలు వంచే ఫార్ములే కేటీఆర్ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతి మీద జరుగుతున్న దాడులను ప్రశ్నించే ఫార్ములే కేటీఆర్, ఏడాదికాలంగా రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న మూర?పు సీఎం ఆగడాలను,అన్యాయాలను నిలదీస్తున్న నాయకుడే మన కేటీఆర్ అని చెప్పారు. ప్రభుత్వానికి మింగుడుపడని, కొరకరాని కొయ్యగా మారి, ప్రజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కేటీఆర్‌పై సర్కారు కుట్రలు, కుతంత్రాలకు కొదవలేదని విమర్శించారు. ప్రశ్నించడమే నేరమా, నిలదీయడమే పాపమా? అని ప్రశ్నించారు. లగచర్ల, దిలావర్‌పూర్‌పై, రైతుకు బేడీల మీద, విద్యార్థుల మరణాలపై, గురుకుల సంక్షోభాలపై నిలదీస్తున్నందుకే కేటీఆర్ కుట్రలా అంటూ నిలదీశారు. కిషన్ రెడ్డిని కిస్మత్ రెడ్డి అంటు విమర్శించిన సీఎం రేవంత్.. స్వయంగా వెళ్లి ఆయనకు సన్మానం చేస్తాడని, కిషన్‌రెడ్డి చేయించుకుంటాడని విమర్శించారు. ప్రజలను అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతిస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీలో కుస్తీ పడతాయని, తెలంగాణలో మాత్రం దోస్తీ చేస్తాయన్నారు. మీ కుట్రలకు, కుతంత్రాలకు తమ నాయకుడు అదరడు, బెదరడని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటాడని, మీ అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలపై నిలదీస్తూనే ఉంటాడని స్పష్టం చేశారు.

## మొగుడంపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టివేత


**సంగారెడ్డి,డిసెంబర్ 13 (నినాదం న్యూస్):**సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. డ్రగ్స్ తరలిస్తున్నారన్న సమాచారంతో మొగడంపల్లి మండలం మాడిగి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ లారీ డ్రగ్స్‌ను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వాటి విలువ రూ.50 కోట్లు ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓడరేవు నుంచి వాటిని ముంబైకి తరలిస్తున్నారని తెలుస్తున్నది.



## వైభవంగా శ్వేతా చౌహాన్‌కు సీమంతం

**మహేశ్వరం, డిసెంబర్ 13 (నినాదం న్యూస్)**
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీ పరిధిలోని సింబా ప్యాలెస్ అదిరాచౌహాన్ ఫంక్షన్ హాల్లో అత్యంత వైభవంగా సభావాట్ శ్వేతా రాజారాం చౌహాన్‌కు భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ బుజ్జి దూదు చౌహాన్, బిందు పృథ్వీరాజ్ చౌహన్, భగవాన్ చౌహన్, రామావత్ దోళ్ళి లక్ష్మణ్ (పాండ్యా) ఆధ్వర్యంలో శ్రీ మంతం మహొత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీపిసిసి కార్యవర్గ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రామవత్ తులసి రామ్ నాయక్, రాష్ట్ర గిరిజన నాయకులు లావుడ్యా విజయ్ గోపాల్ నాయక్, జటావత్ భారతి కిసాన్ నాయక్, జటావత్ గోపాన్, శ్రీను నాయక్, రామావత్ ఫాంత్యా నాయక్, ఆమ్రు నాయక్, శివ లాల్ నాయక్, రాజు నాయక్, నేనావత్ గోపాల్ నాయక్, సభవట్ లలా నాయక్, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సింగ్ కుటుంబ సభ్యులు పెద్దలు స్నేహితులు బంధువులు అభిమానులు తో కలిసి వేడుకలు ప్రారంభించారు. టిపిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... పెద్దింటి ఆడ బిడ్డల జీవితాల్లో సంతోషాన్ని నింపాలన్నారు. మహొత్సమైన వేడుకలు అత్యంత వైభవంగా మహిళలు ఆటల పాటల నృత్యా ల గాజులు చీరే అందించి శ్రీమంతం చేయడం ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు బంధువులు మిత్రులు కుటుంబ సభ్యులు అభిమానులు మహిళలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సింధు చౌహాన్ కళ్యాణ్ నిశ్చితార్థం



**మహేశ్వరం, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీ కు చెందిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సీనియర్ నాయకులు సభావాట్ బూరి శ్రీను చౌహాన్ కుమారుడు కళ్యాణ్ చౌహన్ సింధు తో నల్గొండ జిల్లా దేవరకొండ తాలూకా చందం పేట మండలం పోలేపల్లి గ్రామం మానవత్ తండా కు చెందిన రామావత్ బుజ్జి ధర్మా నాయక్ కుమార్తె సింధు నిశ్చితార్థం అత్యంత వైభవంగా నిర్వహించారు. నిశ్చితార్థం వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదు చౌహాన్, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర రంగారెడ్డి జిల్లా జనసేన అధ్యక్షులు సభావట్ రవి నాయక్, యాదగిరి నాయక్, స్టాలిన్ కిషన్, సోమల నాయక్, రామావత్ పంత్యా నాయక్, రామావత్ పాండ్యా నాయక్, రామావత్ అమృ నాయక్, రామావత్ దసరథ్ నాయక్, రాజు నాయక్, మల్లేష్ నాయక్, చాత్రు నాయక్, లాల చౌహాన్, చందు చౌహన్ గ్రామ పెద్దలు నాయకులు స్థానిక నాయకులతో ఈ వేడుకలో పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని వారి బంధువుల, మిత్రుల, కుటుంబం సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మౌనిక – దేవ్ సింగ్, పూజిత – సికిందర్, సభవట్ బబ్లు చౌహాన్, స్థానిక నాయకులు అభిమానులు బంధువు మిత్రులు, కుటుంబ సభ్యులు పెద్దలు చిన్నలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు చిన్నలు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపి నాయకుడు అవినాష్‌రెడ్డి అరెస్టు


**అమరావతి,డిసెంబర్ 13 (నినాదం న్యూస్):**కడప పార్లమెంట్ సభ్యుడు, వైసీపీ నాయకుడు అవినాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాలలో వైసీపీకి చెందిన రైతులకు నో డ్యూస్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రైతులతో పాటు అవినాష్ రెడ్డి వేముల తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అప్పటికే టీడీపీకి చెందిన రైతులు ఉండడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముందుజాగ్రత్తగా పోలీసులు అవినాష్ రెడ్డిఅదుపులోకి తీసుకొని వేముల పోలీస్‌స్టేషన్‌కు అక్కడి నుంచి పులివెందులకు తరలించారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్న రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని భావించి రైతులకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు వచ్చి ప్రజాస్వామ్యబద్దంగా ఓటు వేయడానికి వస్తే పరాభవం ఎదురవుతుందనే భయంతో పోలీసులను అడ్డుపెట్టుకుని దద్దమ్మ రాజకీయాలు ఆడడం సిగ్గుగా లేదాని ప్రశ్నించారు. అధికారులను అడ్డం పెట్టుకొని తప్పుడు రాజకీయాలు చేయడం క్షమించరాని తప్పని పేర్కొన్నారు . ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేకపోతే సాగునీటి సంఘాలకు నామినేటెడ్ పదవుల మాదిరి చేసుకుంటే సరిపోయేదని. ఈ మాత్రం దానికి ఎన్నికలని పేరు పెట్టడం దేనికని ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని వెల్లడిరచారు.

# స్వామివారిని దర్శనానికి 24 గంటల సమయం



**తిరుమల,డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** కలియుగ ప్రత్యక్షద్కైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా 21 కంపార్టుమెంట్లలో స్వామివారి దర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులు దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడిరచారు. నిన్న స్వామివారిని 61,178 మంది భక్తులు దర్శించుకోగా 22,464 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.85 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# స్వర్ణాంధ్ర విజన్-2047 ఆవిష్కరణ






**అమరావతి,డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇందిరా గాంధీ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. పెద్దఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరయ్యారు. అంతకుముందు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో స్వర్ణాంధ్ర ఏ 2047 పై ఏర్పాటు చేసిన స్టాల్‌లను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు సందర్శించారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాలు.. పేదరికంలేని సమృద్ధికరమైన అవకాశాలు అందించే అద్భుత ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలకు నైపుణ్యాలకు కేంద్రంగా రానున్న రోజుల్లో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఆవిష్కృతమయ్యేలా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చి దిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం రూపొందించిన పది సూత్రాలు స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు. పేదరికం లేని సమాజం, ప్రతి కుటుంబానికి అవసరమైన వనరులు సమకూర్చడం, ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ఈ సూత్రం ప్రధాన లక్ష్యం. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్.. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ముఖ్య ఉద్దేశం. ఉద్యోగ, ఉపాధి కల్పనతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసేలా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు - వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి మరియు ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాలలో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశలలో సమగ్ర సాంకేతికత వంటి 10 సూత్రాలతో విజన్ 2047 రూపొందించారు. స్వచ్ఛాంధ్ర స్టాల్ వద్ద సీఎం చంద్రబాబు ఛలోక్తులు విసిరారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన ఆలోచనలు ఉండాలని సూచించారు. పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారంటూ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. మహిళా రైతులతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఆర్థికాభివృద్ధికి అందుతున్న తోడ్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్‌ను 10సూత్రాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఆక్వా ఉత్పత్తుల రవాణాలో ఇబ్బందులు పరిష్కరించాలని ఆక్వా రైతులు కోరారు. మహిళా ఆర్థికాభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామని డ్వాక్రా మహిళ సుహాసిని అన్నారు. 2047 నాటికి ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజన్ స్వర్ధాంధ్ర 2047పై ప్రత్యేక వీడియో విడుదల చేశారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..**

స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమానికి శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రజలు, అధికారులు తరలివచ్చిన నేపథ్యంలో విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడిరచారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోకి భారీ వాహనాలు రాకుండా నగరం వెలుపల నుంచే వాటి రాకపోకలను నియంత్రించనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్షన్, గుడివాడ, పామర్రు అవనిగడ్డ మీదుగా మళ్లించనున్నట్లు చెప్పారు. చెన్నై- హైదరాబాద్ వెళ్లే వాహనాలను మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, నల్గొండ మీదుగా హైదరాబాద్‌కు మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడిరచారు.

# భారత రాజ్యాంగం ప్రతీ పౌరుడికి దిక్సూచి

**• రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**



**న్యూఢల్లీ, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** భారతరాజ్యాంగం ప్రతి పౌరుడికి ఒక దిక్సూచి అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక చర్చ జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభలో శుక్రవారం ఉదయం జీరో అవర్ ముగిసిన తర్వాత చర్చ ప్రారంభమైంది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిగువ సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశాన్ని ఐక్యంగా, ప్రజాస్వామ్యంగా, స్వావలంబనగా ఉంచేందుకు రాజ్యాంగం ఓ రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే, ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్ని అవమానించాయని మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని అనేక కీలక పథకాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కాగా, శనివారం వరకూ ఈ చర్చ కొనసాగుతుంది. సభ్యులు దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇక చర్చకు ముగింపుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు సమాధానం ఇవ్వనున్నారు.

# అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

**హైదరాబాద్,డిసెంబర్13(నినాదం న్యూస్):**అల్లు అర్జున్ అరెస్ట్‌పై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమని ట్వీట్ చేశారు. 'థియేటర్ వద్ద జరిగిన విషాదకర తొక్కిసలాట ఘటన పోలీస్ శాఖ స్పష్టమైన వైఫల్యాన్ని సూచిస్తోంది. జాతీయ అవార్డును సాధించిన అల్లు అర్జున్ తప్పు ఏవిరీ లేదు. అల్లు అర్జున్ తన విజయాలతో తెలుగు రాష్ట్రాలకు ఎనలేని గర్వం తెచ్చారు. సంబంధం లేని విషయంలో అతడిని బాధ్యుడిని చేయడం అన్యాయం, అసమంజసం. జనాలను నియంత్రంచడంలో లోపాలను పరిష్కరించడానికి బదులుగా, సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకోవడం పరిపాలన వైఫల్యాన్ని సూచిస్తుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత కలిగిన వారిని ఈ ఘటనకు బాధ్యులను చేయాలి. అల్లు అర్జున్ సేవలను గుర్తించి, అతడికి తగిన గౌరవం ఇవ్వాలి. అతడిని నేరస్థుడిలా ట్రీట్ చేయడం మంచిది కాదు' అంటూ రాజా సింగ్ ట్వీట్ చేశారు. కాగా, ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ వైద్య పరీక్షలు ముగిసిన తరువాత నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నారు.

## 15న శ్రీ మహాశక్తి దేవాలయంలో
# అయ్యప్ప స్వామి పడిపూజ

**- పాల్గొననున్న కేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్, డిసెంబర్ 13(నినాదం న్యూస్) :** కరీంనగర్ పట్టణంలోని మహిమాన్విత అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో ఈనెల 15 తేదీ ఆదివారం రోజున శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వాముల వారి దివ్య ఆశీస్సులతో శ్రీ కావేటి పరమేశ్వర్ గురుస్వామిచే శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమాన్ని అదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారు. అయ్యప్ప స్వామికి 108 ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక పూజ, భజన కార్యక్రమాలతో పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నందున, అయ్యప్ప స్వామి దీక్షాపరులు, హిందూ బంధువులు పడిపూజ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు. ఇట్టి పడిపూజ మహోత్సవ వేడుకల్లో కేంద్రమంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు.

# రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదు

**- ఎందరో మహానుభావుల అనుభవసారం**

**- నెహ్రూ పేరునే ఎన్నటికీ చెరిపేయలేరు**

**- లోక్‌సభలో రాజ్యంగంపై చర్చలో ప్రియాంక**



**న్యూఢిల్లీ, డిసెంబర్13 (నినాదం న్యూస్):** భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. జమిలిపైనా ప్రభుత్వం ముందుడుగు వేయడంతో వాడీవేడీగా చర్చ సాగింది. ఎందరో మహానుభావుల అనుభవ సారం మన రాజ్యాంగం అని అన్నారు. ఇందులో విపక్షాల తరపున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆమె.. లోక్‌సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార భాజపా, ఆరెస్సెస్‌పై విమర్శలు చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదని ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. భాజపా ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది. కానీ, దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలన్నారు. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా? నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను వీరిరు పుస్తకాల నుంచి తొలగించగలరేమో.. కానీ, స్వతంత్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరు' అని ప్రియాంక కౌంటర్ ఇచ్చారు.. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను ఆమె ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఈ సందర్భంగా అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'ఒక్కరిని కాపాడటం కోసం 142 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. సంపద, రోడ్లు, పోర్టులు, గనులు అన్నీ ఆయనకే ఇస్తున్నారు' అని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడే ప్రతిపక్షాల గళాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి విపక్ష నేతలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్య పోరాటం ప్రత్యేకమైనది. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాడాం. మన స్వాతంత్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం. దాన్నుంచి ఉద్భవించినదే రాజ్యాంగం. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు.. అంబేద్కర్, మౌలానా ఆజాద్, రాజగోపాలచారి, నెహ్రూ వంటి ఎంతోమంది నేతలు ఎన్నో ఏళ్ల పాటు తమ జీవితాలను అంకితం చేసి దీన్ని రూపొందించారు. ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే శక్తిని రాజ్యాంగం మనకు కల్పించింది. ఇది దేశ ప్రజలను కాపాడే 'సురక్షా కవచం'లా ఉంది. అయితే దీన్ని బద్దలుకొట్టేందుకు అధికార ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని బలహీనపర్చింది. లేట్రల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ వంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని ఎన్డీయే భావించింది. అది జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై వెనక్కి తగ్గింది. ఇది సంవిధాన్.. సంఘ్ రూల్ బుక్ కాదు' అని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. కులగణన జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.

# అపోలో రీచ్ హాస్పిటల్ కార్డియాక్ వైద్య సేవల్లో కొత్త దశను ఆవిష్కరించింది

- **వయసు అడ్డు రాని బైపాస్ సర్జరీ విజయవంతం**
- **ప్రముఖ కన్సల్టెంట్ కార్డియాథోరాసిక్ వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ సంతోష్ కుమార్ దంగేటి**



**కరీంనగర్, డిసెంబర్13(నినాదం న్యూస్) :** కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్‌లో ఒక అరుదైన వైద్య చరిత్ర సృష్టించారు. జగిత్యాల జిల్లా,సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన 84 ఏళ్ల భూమక్కకు విజయవంతంగా బైపాస్ సర్జరీ నిర్వహించి, ఆరోగ్యంగా జీవించడానికి మరో అవకాశం అందించారు . మంగళవారం అపోలో రిచ్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ సంతోష్ కుమార్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ 84 సంవత్సరాల భూమక్కకు బైపాస్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇది అపోలో రీ చ్ హాస్పిటల్‌లో నిర్వహించిన తొలి బైపాస్ సర్జరీగా నిలిచిందన్నారు.
అయితే 80 సంవత్సరాల దాటిన వయసు వారికీ బైపాస్ సర్జరీ రిస్క్‌గా మారుతుందని, వారికి వెంటిలేటర్ అవసరం తో పాటు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. కానీ భూమక్క యాక్టవ్ గా, ఆరోగ్యంగా ఉండటమే ఈ విజయానికి కారణం అన్నారు.భూమక్క యాక్టివ్‌గా ఉండడంతో, ఆమె కుటుంబ సభ్యులు సర్జరీ చేయాలని నిర్ణయించు కున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ సర్జరీ పూర్తిగా ఉచితంగా నిర్వహించబడిందని పేర్కొన్నారు.
వయసు పైబడిన వారికి ఎంఐసిఎస్ మినిమిల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ వంటి సాంకేతికతలు వృద్ధులకు కొత్త ఆశలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్న కోత ద్వారా సర్జరీ చేస్తామన్నారు. తక్కువ నొప్పి ,తక్కువ సమయం పడుతుందన్నారు. ఎముకల కట్ ఉండదని ఇన్ఫెక్షన్, రక్తస్రావం ఉండదన్నారు దీంతో వేగవంతంగా పేషంట్ రికవరీ అవుతారని పేర్కొన్నారు.

అనంతరం భూమక్క మనవడు పవన్ కుమార్ మాట్లాడుతూ, మా నానమ్మకు పునర్జన్మ నిచ్చిన డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ దామోదర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు ఆమె పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు, ఈ సందర్భంగా హాస్పిటల్ పరిపాలకులు డాక్టర్ నాగ సతీష్ మాట్లాడుతూ, హైదరాబాద్ లాంటి ప్రధాన పట్టణాలకే పరిమితమైన దేశవ్యాప్తంగా అతికొద్ది మంది మాత్రమే నిర్వహించగలిగిన మిక్స్ టెక్నిక్ ద్వారా సిఏబిజి కరీంనగర్ లాంటి రెండవ తరగతి పట్టణాలలో కూడా అపోలో రీచ్ హాస్పిటల్ వారు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, గుండె వైద్యానికి సంబంధించి ఉత్తర తెలంగాణలో అగ్రగామి అయిన అపోలో రిచ్ హాస్పిటల్ కాలం మరియు సాంకేతికతతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు అత్యున్నత వైద్య విధానాలు మరియు రోగికి ఆర్థికంగా అందుబాటులోకి ఉంచడం జరుగుతుందని తెలియజేసినారు.

# దేశ ప్రధాన సవాళ్లలో నిరుద్యోగం ఒకటి

- **ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి**
- **జీడీపీ పెంచే దిశాగా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్.బి.ఎన్.రావు**



**కరీంనగర్, డిసెంబర్13 (నినాదం న్యూస్) :** నిరుద్యోగం సమస్య దేశంలోని ప్రధాన సవాళ్లలో ఒకటిగా కొనసాగుతోందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్.బి.ఎస్. రావు అన్నారు. శుక్రవారం నగరంలోని మైత్రి హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధి మధ్య అసమానత, ఆర్థిక పెట్టుబడి లోపం, విద్యా ఉద్యోగాల మధ్య సమన్వయం లేకపోవడం వంటి కారణాలు వల్లె నిరుద్యోగానికి దారి తీస్తుందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడంతో పాటు. వ్యవసాయ ఉత్పత్తి పెంపు, గ్రామీణ పరిశ్రమల ప్రోత్సాహించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్, యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ, ఆత్మనిర్భరతకు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం వల్ల, పారిశ్రామిక రంగం అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, ప్రజలకు మెరుగైన విద్యా ఆరోగ్య సేవలు అందించడం ద్వారా నిరుద్యోగం తగ్గించవచ్చని పేర్కొన్నారు. హెల్త్ కేర్, ఔషధ రంగం, ఎనర్జీ రంగం, ఐటీ, రియల్ ఎస్టేట్, వ్యవసాయం, టూరిజం, హాస్పిటాలిటీ, రిటైల్, ఈ- కామర్స్ లో ఉజ్వల అవకాశాలున్నాయిని పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగాల ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ప్రభుత్వ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పరిశ్రమల ప్రోత్సాహం, యువతలో నైపుణ్య అభివృద్ధి, ఆర్థిక సహాయ పథకాల ద్వారా నిరుద్యోగానికి చెక్ పెట్టవచ్చనిపెంపొందించడంలో ప్రభుత్వ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పరిశ్రమల ప్రోత్సాహం, యువతలో నైపుణ్య అభివృద్ధి, ఆర్థిక సహాయ పథకాల ద్వారా నిరుద్యోగానికి చెక్ పెట్టవచ్చని వెల్లడించారు. ప్రభుత్వం చదువుకున్న ప్రతి యువతకు నమ్మకం కల్గించాలన్నారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉందన్నారు. అనంతరం డాక్టర్.పి.కిషన్ మాట్లాడుతూ సామాజిక స్పృహ ఉన్న మేధావి డాక్టర్.బి.ఎన్.రావు లాంటి వారు పెద్దల సభకు పంపిస్తే సమాజానికి ప్రజలకు మేలు జరుగతుందని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్. పొలాస రాంకిరణ్, డాక్టర్, విజయ్మోహన్రెడ్డి, డాక్టర్. వెంకటేశ్వర్రావు, డాక్టర్. సురేష్ గౌడ్, డాక్టర్, ప్రియాంకరావు, డాక్టర్. మురళీధర్రావు. డాక్టర్. శ్రీవాణి, అడ్వకేట్ గణేష్,, బాస్కార్, దినేష్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి మొత్తం 441 దరఖాస్తులు

**- అర్జీలు స్వీకరించిన ప్రత్యేకాధికారి దివ్య**

**హైదరాబాద్, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 441 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రావిరీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 110, మైనార్టీ సంక్షేమ శాఖ సంబంధించి 76, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 71, విద్యుత్ శాఖ కు సంబంధించి 57, హెూం శాఖ కు సంబంధించి 23, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు

**- చివరకు లాభాల్లో ముగిసిన మార్కెట్లు**

**ముంబయి, డిసెంబర్ 13(నినాదం న్యూస్):** తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు.. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. మళ్లీ అంతే బలంగా పుంజుకొన్నాయి. ఉదయం 1100 పాయింట్లకు పైగా నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్.. చివరికి 840 పాయింట్లు లాభపడడం గమనార్హం. కనిష్ఠాల నుంచి దాదాపు 2 వేల పాయింట్లు పుంజుకొంది. నిఫ్టీ 24,750 ఎగువన ముగిసింది. ముఖ్యంగా ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఈ ఉదయం 81,212.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,289.96) నష్టాల్లో ప్రారంభమైంది. ఒకానొక దశలో 1,129 పాయింట్లు పతనమై 80,082.82 వద్ద కనిష్ఠాన్ని తాకింది. కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం ట్రేడింగ్ సెషన్‌లో పుంజుకున్న సూచీ లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 82,213.92 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అలా చివరకు 843 పాయింట్ల లాభంతో 82,133.12 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఒకానొక దశలో 380 పాయింట్లు కుంగి 24,180.80 కనిష్ఠాన్ని తాకింది. చివరకు 219.60 వద్ద లాభంతో 24,768.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.79గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ తప్ప మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.94 డాలర్లు, బంగారం ఔన్సు 2,688 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

# తెలంగాణ తల్లి రూపాన్ని ఏలా మార్చుతారు

**- తెలంగాణ తల్లిపై సీఎం గెజిట్ ఇవ్వడం దారుణం : కవిత**

**హైదరాబాద్, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మారుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమంలో స్ఫూర్తి నింపిన రూపాన్ని విగ్రహంగా మలుచుకున్నామని చెప్పారు. తెలంగాణ తల్లిపై రేవంత్ రెడ్డి సర్కార్ గెజిట్ ఇవ్వడం దారుణమన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా భరతమాత విగ్రహంపై గెజిట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాలు పెట్టుకున్నామని, జీవో ఇస్తేనే వారి విగ్రహాలు పెడతామా అని



ప్రశ్నించారు. ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి జీవో ఇచ్చారన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజలు కాదన్నారు. ఆ పార్టీది తెలంగాణ వాదం కాదని, కాంగ్రెస్ వాదమని విమర్శించారు. మీరు ముమ్మాటికీ కాంగ్రెస్ వాదులే తప్ప తెలంగాణ వాదులు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లకు ఓట్లు ఉన్నప్పుడే తెలంగాణ ప్రజలు గుర్తుకు వస్తారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకుని ప్రశ్నిస్తున్నారని, ఇందిరాగాంధీ, సోనియా, రాహుల్ కూడా బతుకమ్మ ఆడారన్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించామని చెప్పారు. జీవో కూడా విడుదల చేశామని గుర్తుచేశారు. ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా తెలంగాణ తల్లిని నిలుపుకుంటామన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బతుకమ్మని అవమానించేలా మాట్లాడిన మంత్రులపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మని తొలగించి చెయ్యిగుర్తు పెట్టారని ఆరోపించారు.

# ఢిల్లీ అసెంబ్లీ పోరుకు కాంగ్రెస్ సన్నద్ధం

**- 21మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల**
**- న్యూఢిల్లీ నుంచి బరిలో సందీప్ దీక్షిత్?**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 13(నినాదం న్యూస్):** వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకుగానూ 21 మంది అభ్యర్థుల పేర్లతో కాంగ్రెస్ గురువారం తొలి జాబితాను విడుదల చేసింది. కాంగ్రెస్ నగర విభాగం చీఫ్ దేవేందర్ యాదవ్ బాదలీ నియోజకవర్గం నుంచి, మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్ న్యూ ఢిల్లీ నుంచి పోటీ చేయనున్నట్లు పేర్కొంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ అభ్యర్థులపై చర్చించి ఈ జాబితాకు ఆమోదముద్ర వేసింది. ఇండియా కూటమిలో ఉన్నా కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ మధ్య ఎన్నికల పొత్తు ఉండబోదని ఇరు పార్టీల నేతలు ఇప్పటికే ప్రకటించారు. న్యూఢిల్లీ నుంచి కాంగ్రెస్ మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్‌?ను బరిలోకి దింపింది. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం న్యూ ఢిల్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఒకవేళ ఇదే స్థానంలో కేజ్రీవాల్ పోటీ చేయాలనుకుంటే ఇద్దరి మధ్య ఆసక్తికరమైన పోరు నెలకొనే అవకాశం ఉంది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సందీప్ తల్లి షీలా దీక్షిత్‌?ను ఈ స్థానంలో కేజ్రీవాల్ ఓడించారు. పది సంవత్సరాల్లో ఢిల్లీ చాలా సమస్యలు ఎదుర్కొందని కాంగ్రెస్ నేత ఖాజీ నిజాముద్దీన్ అన్నారు. ఢిల్లీ రోజురోజుకు దిగజారుతున్న పరిస్థితులకు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయన్నారు. దీని పర్యవసానాలు ప్రజలు అనుభవిస్తున్నారని, రెండు ప్రభుత్వాలకు సరైన గుణపాఠం చెప్పాలనుకుంటున్నారని అన్నారు.

# బేగంబజార్‌లో దారుణ ఘటన

**- భార్యా కుమారుడి హత్య.. ఆపై ఆత్మహత్య**

**హైదరాబాద్,డిసెంబర్ 13(నినాదం న్యూస్):** బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఓ భర్త తన భార్య గొంతు కోసి, కుమారుని గొంతు నులిమి హత్య చేశాడు. ఆపై అతను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణాన్ని మరో కుమారుడు చూశాడు. తల్లిని, తమ్ముణ్ణి చంపుతున్న సమయంలో భయాందోళనకు గురైన పెద్ద కుమారుడు తప్పించుకున్నాడు. సమాచారం తెలుసుకున్న బేగంబజార్ పోలీసులు క్లూస్ టీంతో సంఘటన ప్రదేశానికి చేరుకుని.. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్యలకు పాల్పడి, ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మహమ్మద్ సిరాజ్ అలీ, భార్య హేలియ, కుమారుడు హైజాన్.. కుటుంబంలో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిరాజ్ భార్య, కొడుకుని హత్య చేసిన తర్వాత సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకున్నాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సిరాజ్ కుటుంబం.. బ్రతుకు దేరువు కోసం నగరానికి వచ్చారు. ఈ ఘటనకు కారణం తెలియరాలేదు. కాగా సూసైడ్ నోటులో ఏం రాశాడో తెలియదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. అతను యూపి నుంచి వచ్చి ఇక్కడ సెటిల్ అయ్యాడని తెలుస్తోంది. అలాగే హైదరాబాద్ మియాపూర్‌లో విషాదం చోటు చేసుకుంది. నాగలక్ష్మి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. ఆన్ లైన్‌లో గుర్తు తెలియని మందు ఆర్డర్ చేసుకుని.. సేవించి ఆత్మహత్య చేసుకుంది. కాగా ఇటీవలే నాగలక్ష్మికి వివాహమైంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మోడీ సభలో లేకుండా రాజ్యాంగపై చర్చలా

**- సమాజ్‌వాదీ ఎంపీ అఖిలేశ్ విమర్శలు**

**న్యూఢిల్లీ,డిసెంబర్13 (నినాదం న్యూస్):** సభలో ప్రధాని మోదీ లేకుండా రాజ్యాంగంపై చర్చలా?'అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకుని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే హయాంలో వేలాది మంది సామాన్యులు దేశం విడిచి వెళ్లిపోయారని అన్నారు. చాలా మంది భారత పౌరసత్వాన్ని వదులుకున్నారని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం నియంత పాలన సాగిస్తోందని, ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయకుండా అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు. 'మహిళలు పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా పోలీసులు గన్‌లతో బెదిరించి అడ్డుకున్నారు. అయినప్పటికీ ప్రాణాలకు తెగించి వారంతా పోలింగ్‌లో పాల్గొన్నారని సభకు వివరించారు. దేశ సరిహద్దుల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, పొరుగున ఉన్న చైనా సరిహద్దు ఉల్లంఘనలకు పాల్పడుతున్నా తగిన చర్యలు తీసుకోవడంలో కేంద్రం తాత్సారం చేస్తోందని విమర్శించారు. మరోవైపు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి తలసరి ఆదాయంపై ప్రభుత్వం కచ్చితమైన గణాంకాలతో ప్రకటన విడుదల చేయాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. దేశంలో పౌరులంతా సమానమేనని, కానీ, ఇప్పుడు మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపడతామన్నారు. దీనివల్ల కులాల మధ్య వ్యత్యాసం తగ్గుతుందని వివరించారు.

# క్యాల్షియం అధికంగా లభించే ఆహారాలు ఇవే..

క్యాల్షియం మన ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచడంలో సహాయం చేస్తుంది. కండరాలు, కణాలు, నాడులు సరిగ్గా పనిచేసేందుకు కూడా ఇది దోహదపడుతుంది. కనుకనే మనం రోజుకు కనీసం 1000 మిల్లీగ్రాముల మేర క్యాల్షియంను తీసుకోవాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యాల్షియం మనకు ప్రధానంగా పాలు, పాల సంబంధ పదార్థాల నుంచి వస్తుంది. అయితే పాలను తాగడం ఇష్టం లేని వారు, లాక్టోజ్ పడనివారు ఆహారంలో పాలకు బదులుగా క్యాల్షియం కోసం కొన్ని ఆహారాలను తీసుకోవచ్చు. దీంతో క్యాల్షియంతోపాటు ఇతర విటమిన్లు, మినరల్స్ కూడా లభిస్తాయి.

**అంజీర్ పండ్లు..**
అంజీర్ పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను అర కప్పు తింటే చాలు మనకు సుమారుగా 121 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. ఈ పండ్లలో పొటాషియం, ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి కండరాల పనితీరును, గుండె కొట్టుకోవడాన్ని నియంత్రించడం వంటి పలు పనుల్లో సహాయం చేస్తాయి. అంజీర్ పండ్ల ద్వారా మెగ్నిషియం కూడా మనకు లభిస్తుంది. దీని వల్ల రాత్రిపూట కాలి పక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. కండరాల ఆరోగ్యం మెరుగు పడుతుంది.

**నారింజ..**
ఒక పెద్ద నారింజ పండులో సుమారుగా 74 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. ఈ పండ్లలో విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. క్యాలరీలు కూడా తక్కువగానే లభిస్తాయి. కనుక అధిక బరువు తగ్గాలనుకునే వారు కూడా నారింజ పండ్లను తినవచ్చు. దీంతోపాటు ఎముకలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.

**చేపలు..**
చేపలను 120 గ్రాములు తీసుకుంటే 351 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. మెదడు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే విటమిన్ బి12 కూడా మనకు చేపల ద్వారా ఎక్కువగానే లభిస్తుంది. క్యాల్షియం ఎముకల్లోకి ప్రవేశించడానికి తోడ్పడే విటమిన్ డి సైతం చేపల ద్వారా మనకు లభిస్తుంది. కనుక చేపలను వారంలో కనీసం 2 సార్లు తింటే ఎంతో మేలు జరుగుతుంది.

**బెండకాయ..**
బెండకాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. వీటిని ఒక కప్పు తింటే మనకు సుమారుగా 82 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. బెండకాయల్లో విటమిన్ బి6, ఫోలేట్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

## ఎర్రకోటను అప్పగించాలని మొఘల్ వారసుల పిటిషన్

**- పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు**

**న్యూఢిల్లీ,డిసెంబర్13(నినాదం న్యూస్):** ఎర్రకోటను తమకు అప్పగించాలని కోరుతూ మొఘల్ వారసులు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఎర్రకోటను తమ పూర్వీకులు నిర్మించారని, దానిని ప్రభుత్వం తమకు ఇచ్చేయాలంటూ మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనుమడి భార్య సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులో 2021లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు దానిని కొట్టివేసింది. గతంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తమ పూర్వీకుల నుంచి అక్రమంగా తీసుకున్న ఎర్రకోటను తమకు అప్పగించాలని అందులో పేర్కొన్నారు. మొదటి స్వాతంత్ర్య యుద్ధం అనంతరం మొఘలుల ఆస్తులు, ఎర్రకోట వంటి కట్టడాలను బ్రిటిష్ వారు ఆక్రమించుకున్నారని, దీంతో దేశం విడిచి వెళ్లిపోయిన నాటి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 1862లో మృతి చెందినట్లు పిటిషన్‌లో తెలిపారు.వారు నిర్మించిన ఎర్రకోటను ప్రభుత్వం ఆక్రమించుకుందని పేర్కొన్నారు. తమ ఆస్తిని తిరిగి ఇప్పించాలని కోరారు. ఆస్తిని తమకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకుంటే అందుకు పరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... ఆమె అప్పీల్‌ను తోసిపుచ్చింది.

### ప్రియాంకగాంధీ ప్రసంగంపై రాహుల్ గాంధీ ప్రశంస

**- ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారని కితాబు**

**న్యూఢిల్లీ,డిసెంబర్13(నినాదం న్యూస్):** లోక్ సభలో తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన ప్రసంగంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక ప్రసంగం బాగుందని కితాబునిచ్చారు. చాలా విషయాలపై ఆమె అద్భుతంగా మాట్లాడారన్నారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారన్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి గెలిచారు. తాజాగా రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా సభలో ఆమె తొలి ప్రసంగం చేశారు. ఈ ప్రసంగంపై రాహుల్ గాంధీ పైవిధంగా స్పందించారు.భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్ సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. విపక్షాల తరఫున ప్రియాంక గాంధీ చర్చను ప్రారంభించారు. ప్రసంగం సందర్భంగా ఆమె బీజేపీ, ఆరెస్సెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఒక వ్యక్తి కోసం 142 కోట్ల మంది ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించిందన్నారు. కానీ లోక్ సభ ఫలితాల్లో పూర్తి మెజార్టీ రాకపోవడంతో బీజేపీ వెనక్కి తగ్గిందన్నారు.

## అల్లు అర్జున్ అరెస్ట్ అక్రమం

**- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్**



**హైదరాబాద్, డిసెంబర్13(నినాదం న్యూస్):** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. జాతీయ పురస్కారం అందుకున్న స్టార్‌ను అరెస్టు చేయడం పాలకుల అభద్రతా భావానికి ఇది పరాకాష్ట అని విమర్శించారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బాధితులకు పూర్తిగా సానుభూతి తెలుపుతాను.. కానీ ఘటనలో నిజంగా తప్పు చేసింది ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ఘటనకు నేరుగా బాధ్యుడు కానీ అల్లు అర్జున్‌ను సాధారణ నేరగాడిలా ట్రీట్ చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ తీవ్ర చర్యను ఖండిస్తున్నానని తెలిపారు. హైడ్రా కూల్చివేతలతో ఇద్దరి చావుకు బాధ్యుడ్కైన రేవంత్ రెడ్డిని కూడా ఇదే లాజిక్‌తో అరెస్టు చేయాలని సూచించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో ఇవాళ ఉదయం అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 105 సెక్షన్ (నాన్ బెయిలబుల్ కేసు) కింద ఐదు నుంచి పదేళ్లు జైలు శిక్ష పడే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## జూన్ 15న నీట్ పీజీ పరీక్ష

**- నీట్ పీజీ 2025 పరీక్ష తేదీ ప్రకటన**

**న్యూఢిల్లీ, డిసెంబర్13(నినాదం న్యూస్):** దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక మెడికల్ విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే నీట్ పీజీ పరీక్ష 2025 తేదీని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రకటించింది. వచ్చే ఏడాది జూన్ 15వ తేదీన నీట్ పీజీ 2025 పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు నేషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు తన ప్రకటనలో పేర్కొంది. ఆ పరీక్షకు హాజరుకావాలనుకునే వారు వచ్చే ఏడాది జుల్కై 31వ తేదీ నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుందని ఎన్‌బీఈ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా సుమారు 52 వేల పీజీ సీట్లు ఉన్నాయి. వీటి కోసం సుమారు 2 లక్షల మంది ఎంబీబీఎస్ విద్యార్థులు పోటీపడుతున్నారు. మరోవైపు మెడికల్ విద్యా సంస్థల్లో జడలు విప్పుకొన్ని విలయతాండవం చేస్తున్న ర్యాగింగ్ భూతాన్ని అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, 2021లో జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని దేశంలోని అన్ని వైద్య కళాశాలలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆదేశించింది. సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) డిసెంబర్ 2024 పరీక్ష నేడు జరగనుంది. ఇప్పటికే ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించి సీబీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వెబ్‌సైట్‌లో అడ్మిట్‌కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి అడ్మిట్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సీటెట్ పరీక్షను ఓఎమ్మార్ ఆధారితంగా నిర్వహించనున్నారు. కాగా సీటెట్ పరీక్ష ప్రతి యేట రెండుసార్లు జరుగుతుందన్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష మొత్తం రెండు పేపర్‌లకు ఉంటుంది. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించాలనుకునే వారికి నిర్వహిస్తారు. రెండో పేపర్? ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్?స్కోర్‌కు లైఫ్?లాంగ్ వ్యాలిడిటీ ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 20 ప్రధాన భాషల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలకు తప్పనిసరి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది మంది సీటెట్ పరీక్షకు హాజరవుతుంటారు.

## ఐఐటీ స్కాలర్‌పై ఏసీపీ అఘాయిత్యం

**లక్నో, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** ఆమె ఐఐటీ రిసెర్చ్ స్కాలర్. సైబర్‌క్రైమ్, క్రిమినాలజీపై అధ్యయనం చేస్తున్నది. ఇందులో భాగంగా ఏసీపీతో పరిచయం ఏర్పడిరది. అదనుగా తీసుకున్న పోలీస్ అధికారి పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకున్నారు. అనంతరం మాటమార్చడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని విధుల నుంచి తప్పించిన సీపీ.. విచారణ కోసం అడిషనల్ డీసీపీ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేశారు. బాధితురాలు ఐఐటీ కాన్పూర్‌లో పీహెచ్‌డీ చేస్తున్నది. సైబర్‌క్రైమ్, క్రిమినాలజీపై అధ్యయనం చేస్తున్నది. ఇందులో భాగంగా కాన్పూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ మహమ్మద్ మోహిసిన్ ఖాన్‌తో పరిచయం ఏర్పడిరది.



కొంతకాలం తర్వాత ఇద్దరిమధ్య సాన్నిహిత్యం

పెరిగింది. ఆమెను ప్రేమలోకి దించిన ఏసీపీ.. తన భార్యకు విడాకులు ఇచ్చి ఆమెను పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. మాయమాటలు చెప్పి ఆమెపై అఘాయిత్యానికి ఒటిగట్టాడు. అనంతరం ఇచ్చిన మాటను తప్పడంతో మోసపోయానని గ్రహించిన ఆమె నగర పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీసీపీ అంకితా శర్మ, ఏడీసీపీ అర్చన సింగ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వారు కాన్పూర్ ఐఐటీలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు చెప్పిన దాంట్లో నిజం ఉందని తేలడంతో సీపీ అఖిల్ కుమార్‌కు నివేదిక అందించారు. దీంతో ఏసీపీపై అత్యాచారం సహా తీవ్రమైన సెక్షన్ల కింద ఏసీపీపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అతడిని విధుల నుంచి తప్పించి డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

## బంగ్లాలో హిందువుల ఊచకోతపై మౌనమా?

**- ఆలయాల విధ్వంసం జరుగుతున్న పట్టింపేది**

**- వాటిపై ప్రధాని నోరుమెదపరేం: ఉద్ధవ్ థాక్రే**

**ముంబయి,డిసెంబర్13(నినాదం న్యూస్):** బంగ్లాదేశ్‌లోని హిందువుల రక్షణకు భారత్ తీసుకుంటున్న చర్యల గురించి ప్రధాని పార్లమెంటుకు తెలియజేయాలని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే కోరారు. బంగ్లాలో ఘోరం జరుగుతున్నా చర్యలు ఏవని అన్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్న ప్రధాని.. బంగ్లాదేశ్‌లో హింసను మాత్రం ఆపలేరా?' అని ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నించారు. ముంబయిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భాజపా పాటించే హిందుత్వం కేవలం ఓట్ల కోసం మాత్రమేనని మండిపడ్డారు. 'బంగ్లాదేశ్ లో హిందువులు అణచివేతకు గురవుతున్నారు. ఇస్కాన్ కార్యాలయాలను తగలబెట్టారు. అయినా ప్రధాని మోదీ మౌనంగానే ఉన్నారు. బంగ్లాలో జరుగుతున్న ఘటనలకు వ్యతిరేకంగా నిలబడాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులందరి తరఫున మోదీని అభ్యర్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఐక్యత గురించి మన దేశంలో ప్రసంగాలు చేయడంతో ఉపయోగం లేదని.. భారతీయులను హింసకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ప్రపంచ దేశాలను చుట్టివచ్చే కార్యక్రమాలలో బిజీగా ఉండడం వల్ల ఆయనకు ఎంపీలను కలిసే సమయం కూడా ఉండట్లేదని ఎద్దేవా చేశారు. మోదీ తరచుగా విదేశీ పర్యటనలకు వెళ్తుండడం వల్ల ఆయనకు మణిపూర్ అల్లర్లు, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింస గురించి తెలిసి ఉండకపోవచ్చని అన్నారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో సురక్షితంగా ఉన్నారని.. మరి ఆ దేశంలో కష్టాలు పడుతున్న హిందువుల సంగతి ఏంటని ప్రధానిని ప్రశ్నించారు.

## రైతు సమస్యలపై నిలదీస్తే అరెస్టులా

**- మండిపడ్డ మాజీమంత్రి వెల్లంపల్లి**

**విజయవాడ, డిసెంబర్13(నినాదం న్యూస్):** రైతుల సమస్యలపై నిలదీస్తే ..అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రైతులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలో జిల్లా కలెక్టరుకు వినతిపత్రం ఇవ్వడానికి శాంతియుతంగా వెళ్లేందుకు సిద్ధమైన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి డిప్యూటీ మేయర్లు అవుతూ శైలజ రెడ్డి బెల్లం దుర్గ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్రావును, అసిఫ్ ను విజయవాడ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ఏద్కెతే ఉందో ? రైతులకు 20 వేల రూపాయలు ఇస్తామని ఇచ్చిన మాటను తప్పిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన శాంతియుత కార్యక్రమాన్ని అక్రమంగా అడ్డుకోవడం సబబు కాదన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా కలెక్టర్ కు వినతి ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ సూపర్ సిక్స్ అని ప్రజలకు ఒక క్రికెట్ సిక్స్ ఇచ్చిన కుటమి ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజులు సరైన రీతిలో బుద్ధి చెప్తారు అని వెల్లంపల్లి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇదిలావుంటే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ కి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ ని నడిరోడ్డుపై పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వినతిపత్రాన్ని ఇవ్వడానికి బయలుదేరిన అవినాష్‌ను మరికొందరు వైసిపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ పోలీసుల తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు తగవని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవడం తప్పా అంటూ పోలీసులను నిలదీశారు. తమను ఎక్కడకు తీసుకెళుతున్నారో పోలీసులు సమాధానం చెప్పాలని అడిగారు.

# అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

**- భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు**

**- ఫోర్బ్స్ 2024 జాబితా విడుదల**

**న్యూఢల్లీ, డిసెంబర్13 (నినాదం న్యూస్):** ఫోర్బ్స్ 2024 సంవత్సరానికిగాను విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు దక్కింది. వారిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అగ్రస్థానం సంపాదించుకున్నారు. వాస్తవానికి ఫోర్బ్స్ జాబితాలో నిర్మలా సీతారామన్ ఉండడం వరుసగా ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఫోర్బ్స్ – ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. గతేడాది ఆమె 32వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మరో నాలుగు స్థానాలు ఎగబాకడం విశేషం. ఇక, భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ జాబితాలో 81వ స్థానం దక్కించుకున్నారు. గతేడాది ఈమె 60వ స్థానంలో ఉన్నారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజూందర్ షా తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఆమె ఫోర్బ్స్ శక్తిమంతమైన మహిళగా చోటు దక్కించుకున్నారు. ఫోర్బ్స్ జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ మరోసారి అగ్రస్థానం దక్కించుకున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. బిల్‌గేట్స్ మాజీ భార్య మిలిందా ఫ్రెంచ్ గేట్స్ (8వ స్థానం), అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ మాజీ సతీమణి మెకంజీ స్కాట్ (9వ స్థానం), ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్ (23 వ స్థానం) లాంటివారు ఈ జాబితాలో ఉన్నారు. ఇండియాలో తొలి, పూర్తిస్థాయి ఆర్థికమంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు. హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్‌నాడార్ కుమార్తె రోష్నీ నాడార్ మల్హోత్రా. జుల్కై 2020లో హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వ్యూహాత్మక నిర్ణయాలతో కంపెనీని అగ్ర పథంలో నడిపిస్తున్నారని ఫోర్బ్స్ తెలిపింది. 1978లో కిరణ్ మజూందర్ షా బయోకాన్‌ను నెలకొల్పారు. ఆ తర్వాత కాలంలో ఆమె భారత్‌లో అత్యంత సంపన్న మహిళల్లో ఒకరుగా ఎదిగారు. బయోకాన్‌కు మలేషియాలోని జొహెూర్‌లో ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ పరిశ్రమ ఉంది.

# హైదరాబాద్‌లోనే అత్యధికంగా కారు ప్రమాదాలు

- **మెట్రో నగరాల్లో అత్యధికంగా ప్రమాదాలు**
- **వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్? ఇండెక్స్ నివేదికలో వెల్లడి**

**హైదరాబాద్,డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో గత రెండేళ్లలో హైదరాబాద్? మహానగరంలో అత్యధిక కారు ప్రమాదాలు జరిగినట్లు ప్రముఖ వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్? ఇండెక్స్? -2024 పేరుతో తాజాగా నివేదికను విడుదల చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా దేశ రాజధాని ఢిల్లీ, పుణె, బెంగళూరు, కోల్?కతా, ముంబయి, చెన్నై, అహ్మదాబాద్? నగరాలున్నాయని నివేదికలో పేర్కొంది. ఆ నివేదికలో ప్రస్తావించిన ప్రధానాంశాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. దేశవ్యాప్తంగా 78 శాతం రోడ్డు ప్రమాదాలు మెట్రో నగరాల్లోనే జరుగుతున్నాయి. 2022లో అత్యధిక కారు ప్రమాదాల్లో ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటే ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంది. ఢిల్లీలో పోల్చుకుంటే హైదరాబాద్‌లో 46శాతం కార్లు తక్కువ. అయినా గత రెండేళ్లలో హైదరాబాద్‌లోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. హైదరాబాద్‌లో ప్రమాదాలను ఎక్కువ ఆస్కారమున్న ప్రాంతంగా మియాపూర్ నిలిచింది. దేశవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. బెంగళూరులోని బొమ్మనహళ్లి, ఢిల్లీలోని నోయిడా, పుణెలోని మరుంజి, ముంబయిలోని మిరారోడ్, చెన్నైలోని మెడవక్కం ప్రాంతాలు మొదటి 5స్థానాల్లో ఉన్నాయి. జంతువుల కారణంగా జరిగే గమనిస్తే శునకాలతో 62%, ఆవులతో 29%, బర్రెలతో 4%, కోతులతో 3%, మేకలతో 1% చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, నిద్రలేమి, డ్రైవింగ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇందుకు కారణాలుగా తెలుస్తున్నాయి. అలాగే మెట్రో నగరాలు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ఉరుకులు పరుగుల సాగే రోడ్లపై ఎటు నుంచి ఎవరూ వస్తారో తెలియకపోవడం లాంటివి కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు. చలికాలం కావడంతో తెల్లవారుజామున పొగమంచు కురుస్తుంటుంది. దీంతో రోడ్లపై ఏం వస్తున్నాయో లేదో అన్నది దగ్గరకి వస్తే కానీ తెలియదు. ఈ కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. అందుకు వాహనాలు నడిపించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు చెబుతున్నారు. సూర్యోదయం అయ్యాకే రోడ్లపైకి రావాలని సూచిస్తున్నారు. పొగమంచు తగ్గిన తర్వాత ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం అని అంటున్నారు.

# అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై విపక్షాలు అభిశంసన తీర్మానం

- **వీహెచ్‌పీ కార్యక్రమంలో వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యం**
- **రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేత**

**అలహాబాద్,డిసెంబర్ 13(నినాదం న్యూస్):** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టాయి. ఇటీవల జరిగిన వీహెచ్?పీ కార్యక్రమంలో ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సెక్రటరీ జనరల్?కు నోటీసును అందించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్?పై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించడానికి సంబంధించిన నోటీసుపై కపిల్ సిబల్, దిగ్విజయ్ సింగ్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ర%ఝ%, చిదంబరం, రణ్ దీప్ సుర్జేవాలా, ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, ముకుల్ వాస్నిక్, నాసీర్ హుస్సేన్, రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, రేణుకా చౌదరి సహా 55 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేశారు. వీరందరూ కలిసి రాజ్యసభ సెక్రటరీ జనరల్ ను సభా కార్యక్రమాలు ప్రారంభానికి ముందు కలిశారు. ఈ క్రమంలో అభిశంసన నోటీసును అందజేశారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం 1968, రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 కింద ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసును సమర్పించారు. విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని నోటీసులో విపక్ష సభ్యులు ఆరోపించారు. ద్వేషపూరిత ప్రసంగం, మత సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. న్యాయమూర్తి మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారని, వారిపై పక్షపాతం చూపించారని తెలిపారు. "జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించిన విషయాలపై రాజకీయంగా మాట్లాడారు. బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇలా చేయడం న్యాయవ్యవస్థను ఉల్లంఘించినట్లే. జస్టిస్ శేఖర్ కుమార్ చేసిన బహిరంగ వ్యాఖ్యలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. అలాగే పక్షపాతంతో కూడుకున్నవి" అని నోటీసులో పేర్కొన్నారు. "దేశంలోని మెజారిటీ ప్రజల ఇష్టానికి అనుగుణంగా భారత్ పనిచేస్తుందని జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(ఈ) కింద పొందుపరచిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించారు. ఆయన వ్యాఖ్యలు వివిధ మతాలు, మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి. రాజ్యాంగంలోని లౌకిక నీతిని ఉల్లంఘిస్తున్నాయి. ఈ నోటీసును ఆమోదించాలని రాజ్యసభ ఛైర్మన్ ను విజ్ఞప్తి చేస్తున్నాం. 1968 న్యాయమూర్తుల (విచారణ) చట్టం ప్రకారం భారత రాష్ట్రపతికి ఈ నోటీసును పంపాలి. ద్వేషపూరిత ప్రసంగం, న్యాయ ఉల్లంఘనల ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని రాజ్యసభ ఛైర్మన్ ను అభ్యర్థిస్తున్నాం. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ కు తొలగించాలి. " అని అభిశంసన నోటీసులో విపక్ష సభ్యులు పేర్కొన్నారు. డిసెంబర్ 8న జరిగిన వీహెచ్?పీ కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి పౌరస్మృతి ప్రధాన లక్ష్యం సామాజిక సామరస్యం, లింగ సమానత్వం, లౌకికవాదాన్ని ప్రోత్సహించడమేనని అన్నారు. అలాగే మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే చట్టం నడుచుకోవాలని వ్యాఖ్యానించారు. దీంతో ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో ఈ ఘటనపై నివేదిక సమర్పించాలని హైకోర్టును సుప్రీం కోర్టు

## తమిళనాడులో అగ్ని ప్రమాదం : ఏడుగురు మృతి

**చెన్నై, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దిండిగల్ జిల్లా గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఆసుపత్రిలో చిక్కుకుపోయిన రోగులను రక్షించి ఇతర ఆసుపత్రులకు తరలించారు. పొగ కారణంగా స్పృహ కోల్పోయిన కొందరు సిబ్బందిని సైతం రక్షించి చికిత్స నిమిత్తం వేరే ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఓ బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది. మెడికల్ ఫెసిలిటీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### జగదీప్ ధన్‌కడ్, మల్లిఖార్జున్‌ఖర్గేల

## మధ్య మాటల యుద్ధం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 (నినాదం న్యూస్):** రాజ్యసభలో ఇవాళ గందరగోళం నెలకొన్నది. ఛైర్మన్ జగదీప్ ధన్‌కడ్.. ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే మధ్య మాటల యుద్ధం సాగింది. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. వాయిదా తీర్మానాలను స్వీకరించాలని విపక్షాలు కోరాయి. ఆ సమయంలో ఛైర్‌లో ఉన్న ధన్‌కడ్ మాట్లాడుతూ.. గడిచిన 30 ఏండ్లలో ఎన్ని సార్లు రూల్ 267 వాడారో తనకు తెలుసు అన్నారు. మీ విజ్ఞతకే ఈ విషయాన్ని వదిలి వేస్తున్నట్లు చెప్పారు. రికార్డు స్థాయిలో రూల్ 267 కింద వాయిదా తీర్మానాలను ఇచ్చినట్లు ధన్‌కడ్ పేర్కొన్నారు. విపక్షాలు పట్టుపట్టడంతో.. ఛైర్మన్ ధన్‌కడ్ సీరియస్ అయ్యారు. నేను రైతు బిడ్డను, నేను ఎటువంటి బలహీనతను ప్రదర్శించబోనని ధన్‌కడ్ తెలిపారు. ఈ దేశం కోసం ప్రాణాలిస్తాను, ఓ రైతు బిడ్డ ఎలా ఈ స్థానంలో కూర్చున్నారన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. మీ వెకిలి చేష్టలు అందరికీ తెలుసు అని, నేను చాలా ఓపిక పట్టాను, కానీ నేటి రైతు కేవలం పంటపొలాలకే పరిమితం కాదు అని అన్నారు. రూల్స్‌ను చదువుకోవాలని, ఒకవేళ మోషన్ మూవ్ చేస్తే అది 14 రోజులు పడుతుందన్నారు. మీరు టైం తీసుకుని వచ్చి చర్చించండి, లేదంటే నేనే మీవద్దకు వచ్చి చర్చిస్తానన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో చంపేస్తోన్న చలి పులి

**- తగ్గిన ఉష్ణోగ్రతలు.. వణుకుతున్న జనం**

**హైదరాబాద్,డిసెంబర్ 13(నినాదం న్యూస్):** తెలుగు రాష్ట్రాలనూ మంచు ముంచేస్తోంది. చలితీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అటు దట్టమైన మంచుతో వాహనాలు, విమానాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా పొగ మంచు కురుస్తోంది. పొగమంచుతో విమానాల రాకపోకలపై ప్రభావం పడుతోంది. బెంగళూరు, హైదరాబాద్, ఢల్లీ వెళ్లే విమానాలు ఆలస్యం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పొగమంచు ప్రభావం రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఇక మంచు ఎక్కువగా ఉండటంతో విమానాల రాకపోకలకు సైతం ఆటంకం కలుగుతోంది. ఆదిలాబాద్, అల్లూరి జిల్లాల్లో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. అటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అత్యల్పంగా 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోద్కెంది. రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఉత్తర, ఈశాన్య భారతం మీదుగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులను చలి వణికిస్తోంది. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లా వ్యాప్తంగా మంచు కమ్మేసింది. ఆదిలాబాద్‌లో కనిష్ఠంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోద్కెంది. చలికి తోడు గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో చలిపంజా విసురుతోంది. దీంతో నగర వాసులు బయటకు వచ్చేందుకు వణుకుతున్నారు.. ఉదయం 9 దాటినా చలి తీవ్రత కొనసాగుతోంది.

# రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బాంబు బెదిరింపు




**న్యూఢిల్లీ,డిసెంబర్13(నినాదం న్యూస్):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కి బాంబు బెదిరింపు వచ్చింది. బ్యాంకును పేల్చివేస్తామం టూ బెదిరింపు మెయిల్ రావడంతో తీవ్ర కలకలం రేగింది. అధికారిక వెబ్‌సైట్‌లో రష్యన్ భాషలో బెదిరింపులు వచ్చినట్లు ఒక ఇమెయిల్ వచ్చింది. ఆర్బీఐకి బెదిరింపుతో అప్రమత్తమైన పోలీసులు విచారణ చేపట్టారు. ఆర్బీఐని బాంబుతో పేల్చివేస్తామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే మాతా రమాబాయి మార్గ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ముంబై పోలీసులు తెలిపారు. నెల వ్యవధిలో ఇలాంటి సంఘటన జరగడం ఇది రెండోసారి. గతంలో కూడా ఆర్బీఐకి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది నవంబర్‌లోనే ఆర్బీఐ కస్టమర్ కేర్ విభాగానికి బెదిరింపు కాల్ వచ్చింది. ఉదయం 10 గంటలకు కాల్ వచ్చింది. తాను లష్కరే తోయిబా సీఈఓ అని బ్యాంకును పేల్చేస్తామంటూ బెదిరించాడు. ఈరోజు తెల్లవారుజామున, ఢిల్లీలోని 6 ప్రముఖ పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. పాఠశాలలకు ఇమెయిల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే అనుమానాస్పదంగా ఏమీ లభించలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఢిల్లీలోని ఈస్ట్ ఆఫ్ కైలాష్ %ణూ%, సల్వాన్ స్కూల్, మోడ్రన్ స్కూల్ మరియు కేంబ్రిడ్జ్ స్కూల్‌లకు ఇ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. పోలీసులు నాలుగు పాఠశాలలకు చేరుకుని విచారణ ప్రారంభించారు.

# అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్

**-భూమిని ఢీకొట్టబోతున్న ఆస్టరాయిడ్?**

**-ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి**



**న్యూఢిల్లీ,డిసెంబర్13(నినాదం న్యూస్):** అంతరిక్షంలో తిరుగుతున్న ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆ ఆస్టరాయిడ్ ఢీకొంటే దారుణమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ ఆస్టరాయిడ్ పై ఇస్రో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ తాజాగా వెల్లడిరచారు. అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్ భవిష్యత్తులో భూమికి అత్యంత సమీపంగా వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. సుమారు 450 మీటర్ల పొడవు, 170 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆస్టరాయిడ్... 2029 ఏప్రిల్ 13న భూమికి అత్యంత దగ్గరగా అంటే.. కేవలం 32 వేల కిలోమీటర్ల సమీపం నుంచి దూసుకువెళు తుందని తేల్చారు. అంటే భూమి చుట్టూ స్థిర కక్ష్యలో తిరిగే కమ్యూనికేషన్ శాటిలైట్ల కంటే కూడా ఇది దగ్గరగా వస్తుండడం గమనార్హం. అపోఫిస్ మన యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య కంటే పెద్దదని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. అపోఫిస్ భూమిని ఢీకొట్టే పరిస్థితి, దాని గమనం, ఇతర అంశాలపై ఇస్రోలోని 'నేత్ర (నెట్ వర్క్ ఫర్ స్పేస్ ఆబ్జెక్ట్ ట్రాకింగ్ అండ్ అనాలసిస్)' విభాగం ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో నాసాకు చెందిన ఒసిరిస్ ఆర్ఈఎక్స్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రామ్సెస్ విభాగాలతో ఆస్టరాయిడ్లపై పరిశోధనలో కలసి ముందుకువెళుతున్నట్టు వివరించారు.

# రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత కోరుకుంటున్నా



**అమరావతి,డిసెంబర్13(నినాదం న్యూస్):** రాష్ట్రానికి తక్కువలో తక్కువగా దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు రాజకీయ సుస్థిరత ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యు మెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుల, మత, ప్రాంతాల పరంగా కొట్టుకునే రోజులు ఇక పోయాయన్నారు. రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసే పరిస్థితులు ఇక ఉండవన్నారు. చంద్రబాబుకు భగవంతుడు నిండు నూరేళ్ల ఆయుషుతో పాటు మంచి ఆరోగ్యం ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'చంద్రబాబు నా గౌరవ మర్యాదలు ఎక్కడా తగ్గకుండా చూస్తూ నన్ను నమ్మిన ప్రజలకూ గౌరవం ఇస్తున్నారు. అలాంటి చంద్రబాబు గౌరవం నేను ఏ రోజూ తగ్గించను' అని స్పష్టం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలో ఉన్న అన్ని స్థాయిల్లో నాయకులు చంద్రబాబుతో తానెలా కలిసి పనిచేస్తున్నానో అలాగే సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. అప్పుడప్పుడు కొన్ని సమస్యలున్నా వాటిని అధిగమించి వెళ్లటమే ప్రజలు మనకిచ్చిన ఎన్నికల ఫలితాన్ని సాకారం చేయటం అని అన్నారు. వేదిక మీద ఉన్న వాళ్లమంతా ఒకే మాట మీద ఉన్నాం, చంద్రబాబు వెన్నంటే ఉన్నామని తెలిపారు. అంతా కలిసి ప్రధాని మోదీ కనే వికసిత్ భారత్ కలను సాకారం చేస్తామన్నారు. మోదీ ఆకాంక్ష నెరవేరాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చంద్రబాబు నాయకత్వంలో బలంగా ఉండాలని తెలిపారు. అద్భుతమైన 2047 విజన్ సాకార యాత్రలో చంద్రబాబు వెన్నంటే ఉంటా అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రజల జీవితాలు బాగుపడాలంటే సరైన సారథ్యం వహించే మహానాయకుడు సీఎం చంద్రబాబు అని ఉపముఖ్యమంత్రి అన్నారు. విజన్ స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ కోట్లాది మంది కలలను సాకారం చేసే మహాసంకల్పమన్నారు. పార్టీ పెట్టి తాను నలిగిన తర్వాతే చంద్రబాబు విలువేంటో మరింత తెలిసి ఆయనపై అపార గౌరవం పెరిగిందని చెప్పుకొచ్చారు. పార్టీ నడపటం అంటే ఆత్మహత్యా సదృశ్యంతో సమానమన్నారు. ప్రతీ ఒక్కరికీ దిక్సూచీ అవసరమన్నారు. విజన్ 2020 నాడు తన స్థాయికి అర్థం కాలేదని తెలిపారు. చంద్రబాబు ఆయన కోసం కలలు కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం కలలు కన్న మహానాయకుడని విజన్ 2020 ఫలితాల ద్వారా అర్థమైందన్నారు. నాడు రాళ్లు రప్పలు చూసిన ప్రాంతంలో చంద్రబాబు సైబర్ సిటీ మహానగరాన్ని చూశారన్నారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న సైబరాబాద్ రూపకర్త, శిల్పి, చీఫ్ ఆర్కిటెక్ట్ చంద్రబాబే అంటూ కొనియాడారు. ఎంతో కష్టపడి కట్టిన ట్విన్ టవర్స్‌ను ఉగ్రవాదులు ఒక పూటలోనే కూల్చేశారని.. నిర్మాణం విలువ తెలియని గత పాలకులూ ఇదే మాదిరి వ్యవహరించారన్నారు. 'చంద్రబాబు ఓపికను ఎన్నిసార్లు మెచ్చుకున్నా సరిపోదు.

## పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

**-ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి**

**-వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం**

**-రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్**

**-న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు**



హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. పార్టీల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. హైదరాబాద్ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. తాగి వాహనం నడిపితే 10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిపైనా కేసు నమోదు చేస్తామన్న పోలీసులు.. ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## సినిమా వాళ్ల విషయంలో అతిగా స్పందన

**అల్లు అర్జున్ అరెస్ట్‌పై నాని**

**హైదరాబాద్,డిసెంబర్13(నినాదం న్యూస్):** అల్లు అర్జున్ అరెస్ట్‌పై నటుడు నాని స్పందించారు. ఇది మనందరి తప్పు అని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. అదొక దురదృష్టకర, హృదయ విదారక ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. సినీ దర్శకుడు అజయ్ భూపతి సైతం అల్లు అర్జున్ అరెస్ట్‌ను ఖండించారు. ఇది ఏమాత్రం కరెక్ట్ కాదని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'పుష్ప 2 ది రూల్' ప్రీమియర్ షోలో భాగంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో భాగంగా అల్లు అర్జున్‌ను ఈరోజు మధ్యాహ్నం పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్‌మీడియా వేదికగా నెటిజన్లు దీనిని ఖండిస్తున్నారు.

## సభలో ప్రియాంక స్పీచ్ అదుర్స్


**నాకన్నా బాగా మాట్లాడిందంటూ..రాహుల్ కితాబు**

**న్యూఢిల్లీ,డిసెంబర్13(నినాదం న్యూస్):** వయనాడ్ ఎంపీగా గెలిచి లోక్‌సభలో తొలిసారి అడుగుపెట్టారు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా. తాజాగా రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా సభలో ఆమె తొలి ప్రసంగం చేశారు. దీనిపై ఆమె సోదరుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక స్పీచ్ బాగుందంటూ ప్రశంసలు కురిపించారు. చాలా విషయాలపై ఆమె అద్భుతంగా మాట్లాడారని అన్నారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఇందులో విపక్షాల తరఫున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా (ఖసతాజీనీజీ ఉజీనిటరతి) చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె అధికార భాజపా, అరెస్సెస్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. ఒక వ్యక్తి కోసం 142 కోట్ల మంది ప్రయోజనాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలని భాజపా ప్రయత్నించిందని, కానీ, లోక్‌సభ ఫలితాలతో (అధికార పార్టీకి భారీ మెజార్టీ రాకపోవడాన్ని ఉద్దేశిస్తూ) ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదని మండిపడ్డారు.

## అరటి పండు , బొప్పాయి

# కలిపి తింటే ఏం జరుగుతుందో తెలుసా..?

అరటి పండు మరియు బొప్పాయిని కలిపి తినడం గురించి చాలా మందిలో అనుమానాలు ఉంటాయి. ఆయుర్వేదం ప్రకారం, ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు, తలనొప్పి, వాంతులు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎందుకు ఈ సమస్యలు వస్తాయి? అరటిపండు శరీరాన్ని చల్లబరుస్తుంది, అయితే బొప్పాయి శరీరాన్ని వేడి చేస్తుంది. ఈ రెండు విభిన్న స్వభావం కలిగిన పండ్లను కలిపి తినడం వల్ల జీర్ణవ్యవస్థలో అసమతుల్యత ఏర్పడుతుంది. బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ ప్రోటీన్‌ను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. అయితే, అరటిపండులోని కొన్ని పదార్థాలు ఈ ఎంజైమ్‌ను నిరోధించి, జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. %ాూశ్రీంశీ =ముం% "ఇన్‌స్టంట్ కాఫీకి ఫిల్టర్ కాఫీకి తేడా ఏంటో తెలుసా..?" ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి? అరటి మరియు బొప్పాయిని విడివిడిగా తినడం మంచిది. రెండింటినీ కలిపి



తినాలనుకుంటే కనీసం ఒక గంట వ్యవధిలో తీసుకోండి. జీర్ణ సమస్యలు, ఆస్తమా లేదా అలర్జీలు ఉన్నవారు బొప్పాయిని జాగ్రత్తగా తీసుకోవాలి. ఏదైనా అనుమానం ఉంటే వైద్యులను సంప్రదించడం మంచిది. ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది: ప్రతి వ్యక్తి శరీరం ఒకటి కాదు. కొంతమందికి ఈ రెండింటిని కలిపి తినడం వల్ల ఎలాంటి సమస్యలు ఉండకపోవచ్చు. ఆయుర్వేదం ప్రకారం ఈ కలయికను నిషేధించినప్పటికీ, శాస్త్రీయంగా ఇంకా పూర్తిగా నిరూపించబడలేదు. ముగింపు: సాధారణంగా, అరటి మరియు బొప్పాయిని విడివిడిగా తినడం ఆరోగ్యానికి మంచిది. అయితే, మీరు ఈ రెండింటిని కలిపి తినాలనుకుంటే, మీ శరీరాన్ని గమనిస్తూ జాగ్రత్తగా తీసుకోండి. ఏదైనా అసౌకర్యం కలిగితే వెంటనే ఆహారం తీసుకోవడం మానేసి, వైద్యులను సంప్రదించండి.

## పచ్చిమిర్చిని ఆహారంలో

# చేర్చుకుంటున్నారా?



భారతీయ వంటకాల్లో పచ్చిమిర్చికు ప్రత్యేక స్థానం ఉంది. మిర్చిలేని కూర దాదాపు ఉండదు. ఇది రుచితో పాటు సువాసనను అందిస్తుంది. పచ్చిమిర్చిని ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి అనేక రకాలుగా ప్రయోజనాలను అందిస్తుంది. ఇది శరీరానికి అవసరమైన పుష్కలమైన పోషకాలతో పాటు, ఆరోగ్యానికి మేలు చేసే గుణాలను కలిగి ఉంటుంది. పచ్చిమిర్చిలో ప్రధానంగా కాప్సైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది, ఇది ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఆరోగ్య ప్రయోజనాలు పచ్చిమిర్చిలోని క్యాప్సైసిన్ అనే పదార్థం జీర్ణ రసాలను ఉత్తేజపరిచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీనిలోని క్యాప్సైసిన్ జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది చెడు కొవ్వు తగ్గించడంలో సహాయపడుతుంది, తద్వారా బరువు తగ్గే ప్రక్రియ వేగవంతమవుతుంది. పచ్చిమిర్చిలోని యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాలను విశ్రాంతి చేసి, రక్తపోటును నియంత్రిస్తాయి. ఇది గుండె జబ్బులను నిరోధించడంలో సహాయపడుతుంది. పచ్చిమిర్చిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది ఇమ్యూనిటీని మెరుగుపరచి శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది. %ాూశ్రీంశీ =ముం% "ఉదయం నిద్రలేవగానే ఈ అలవాట్లు మార్చుకోండి.. లేకపోతే తిప్పలే.!!" అంతే కాకుండా పచ్చిమిర్చిలో ఉండే విటమిన్ సి చర్మాన్ని మరమ్మతు చేసి, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ముడతలు, మచ్చలు వంటి సమస్యలను తగ్గిస్తుంది. పచ్చిమిర్చిలోని యాంటీ ఆక్సిడెంట్లు కొన్ని రకాల క్యాన్సర్‌లను నిరోధించడంలో సహాయపడతాయి. దీనిలోని క్యాప్సైసిన్ నొప్పిని తగ్గించే గుణాలను కలిగి ఉంది. కీళ్ల నొప్పులు, తలనొప్పి, నరాల నొప్పుల వంటి సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. పచ్చి మిర్చిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల మలబద్ధకం, గ్యాస్, జీర్ణ సంబంధిత ఇతర సమస్యలను తగ్గించగలదు. పచ్చిమిర్చి తినడం ద్వారా ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. చల్లటి వాతావరణంలో పచ్చిమిర్చి తినడం ద్వారా శ్వాసకోశ మార్గాలు శుభ్రం అవుతాయి. జలుబు, దగ్గు వంటి సమస్యలను నివారించడంలో ఇది సహాయపడుతుంది. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించి, శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. పచ్చిమిర్చి రక్త నాళాలను విస్తరించి, రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది హృద్రోగ సమస్యలను నివారించడంలో దోహదపడుతుంది. ఉపయోగించే విధానం పచ్చిమిర్చిని కూరల్లో, సూప్‌లు, చట్నీలు, సలాడ్‌లలో చేర్చుకోవచ్చు. పప్పులలో వేసి తినవచ్చు. పిజ్జా, బర్గర్‌లలో టాపింగ్‌గా వాడవచ్చు. అయితే అధిక మోతాదులో తినడం కొంతమందికి అసౌకర్యంగా ఉంటే, మితంగా వాడటం మంచిది. పచ్చిమిర్చి తినడం వల్ల కొందరికి గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తవచ్చు. గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు వైద్యుల సలహా తీసుకొని తినాలి. కడుపులో అల్సర్ ఉన్నవారు జాగ్రత్తగా తినాలి. పచ్చిమిర్చిని ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి సమగ్ర మేలు చేస్తుంది. సరైన విధంగా ఉపయోగించడం ద్వారా దీని పూర్తి లాభాలను పొందవచ్చు. ఇది మీ శరీరాన్ని బట్టి ఉంటుంది, కాబట్టి అవసరమైతే డాక్టర్ సలహా తీసుకోవాలి.

## చాయ్‌లో యాలకులు

# కలిపి తాగుతున్నారా?



కొంతమందికి చాయ్ తాగనిదే రోజు ప్రారంభం కాదు. టీని కొన్ని రకాల మసాలా దినుసులు కూడా కలిపి చేస్తారు. అలాంటి వాటిల్లో అల్లం, యాలకులు, లవంగాలు ప్రధానమైనవి. ప్రధానంగా యాలకులు వేసి చేసిన టీ ఆహ్లాదకరమైన సువాసన , రుచిని కలిగి గుంది. ఈ చాయ్ కేవలం రుచి కోసం మాత్రమే కాదు, మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. యాలకులు (%ఖుతీఱఎశీ%) భారతీయ వంటకాలలో సాధారణంగా ఉపయోగించే సుగంధ ద్రవ్యం మాత్రమే కాదు. ఒక ఔషధగుణాలను కలిగిన పదార్థం కూడా. టీలో యాలకులు చేర్చి తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు చూద్దాం. టీ తాగడం వల్ల కలిగే లాభాలు: టీలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి కాపాడుతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. కొన్ని రకాల టీలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గ్రీన్ టీ వంటివి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. కొన్ని రకాల టీలు జీవక్రియ రేటును పెంచి బరువు తగ్గడానికి సహాయపడతాయి. అలాంటి వాటిల్లో యాలకులతో చేసిన టీ ఒకటి. %ాూశ్రీంశీ =ముం% "ఉదయం నిద్రలేవగానే ఈ అలవాట్లు మార్చుకోండి.. లేకపోతే తిప్పలే.!!" యాలకులు వేసిన చాయ్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు యాలకులకులతో చేసిన చాయ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్తి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయి. యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శ్వాసకోశ సమస్యలను తగ్గించడానికి సహాయపడతాయి. దగ్గు, జలుబు, అలర్జీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. రక్తపోటును నియంత్రించడానికి సహాయపడతాయి. గుండె సంబంధిత వ్యాధులను నిరోధిస్తాయి. మెదడుకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి. యాలకుల్లో క్యాన్సర్ కణాల వృద్ధిని నిరోధించే గుణాలు ఉన్నాయి. నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. యాలకులు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడతాయి. మనోధైర్యాన్ని పెంచుతాయి. జీవక్రియను వేగవంతం చేయడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడతాయి. యాలకులు వేసిన చాయ్ తయారీ: ఒక కప్పు నీటిని మరిగించండి. దీనిలో 2-3 యాలకులు, ఒక అంగుళం దాల్చిన చెక్క, కొద్దిగా ఇంగువ వేసి మరిగించండి. తరువాత చాయ్ పొడి వేసి కాసేపు మరిగించి, స్ట్రైనర్‌తో వడకట్టి తాగండి. మీరు ఇష్టమైతే పాలు, చక్కెర కూడా వేసుకోవచ్చు. అయితే ఉదయం లేచి వెంటనే ఒక కప్పు టీ తాగడం వల్ల శరీరం చురుగ్గా మారుతుంది. సాయంత్రం భోజనం తర్వాత కూడా తాగవచ్చు. అయితే రాత్రి నిద్రకు ముందు తాగడం మంచిది కాదు. %ాశీషవీవం దీం% యాలకులు అన్ని రకాల వంటకాలలో ఉపయోగించవచ్చు. అయితే అధికంగా యాలకులు తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, మంట వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు యాలకులను తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

# ఉచిత న్యాయ సహాయం పొందడం ఎలా?


భారతదేశంలో ధనిక, పేద, కులం, మతం తేడా లేకుండా అన్ని వర్గాలు న్యాయం దృష్టిలో అందరూ సమానులే. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుంది. అయితే, పేదరికం కారణంగా కొందరు తమకు అందాల్సిన న్యాయం కోసం పోరాడటంలో వెనకబడి పోతున్నారు. ఇలాంటి వారందరికీ మన రాజ్యాంగం, ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. వాటికి సంబంధించిన వివరాలను తెలుసుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉంది. తమ హక్కులను కోల్పోకుండా పేద ప్రజలు ఉచిత న్యాయసాయాన్ని పొందవచ్చు. బీద, బలహీన వర్గాల వారికి న్యాయ విధానం అందుబాటులోకి తేవడం కోసం, వారికి సామాజిక, ఆర్థిక న్యాయాలు కల్పించడం కోసం ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలని నిశ్చయించాయి. ఫలితంగా 1976వ సంవత్సరంలో భారత రాజ్యాంగానికి అధికరణ 39-ఎ జతచేసి బీద, బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం రాష్ట ప్రభుత్వాల బాధ్యతగా నిర్దేశించారు. %ూశ్రీంశీ =ఘు౧% " పెళ్లైనా ఏమాత్రం మారని శోభిత ధూళిపాళ" అంతే కాకుండా ఇందుకోసం ఒక చట్టాన్ని రూపొందించారు. అదే న్యాయ సేవల అధికారాల చట్టం. ఇది కెంద్ర చట్టము. ఈ చట్టము నిర్దేశించినట్లు మన రాష్ట్ర ప్రభుత్వము,




రాష్ట్ర హైకోర్టు ఉమ్మడిగా చర్చించి కొన్ని సూత్రాలను నిర్దేశికాలను రూపొందించాయి. అరులు ఎవరంటే? ఈ చట్టము, దాని అనుబంధ సూత్రాల ప్రకారము దిగువ కనబరచిన వారు ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి అరులుగా నిర్ణయించారు. షెడ్యూల్డ్ కులము లేక తెగకు చెందినవారు మానవ అక్రమ రవాణా బాధితులు, బెగారులు స్త్రీలు, పిల్లలు మతిస్థిమితం లేనివారు, అవిటివారు సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి భూకంపాలు, పారిశ్రామిక విపత్తుల వంటి విపత్తులలో చిక్కుకున్నవారు. %=వషిశీఎఎవఅ౧వ౧ ఖీశీతీ‾శీబ% "ఏపీలో మహిళలకు సంక్రాంతికి సూపర్ బహుమానం సిద్ధం చేస్తున్న చంద్రబాబు!" పారిశ్రామిక కార్మికులు ఇమ్మెరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) చట్టము 1956లో సెక్షన్ 2 (జి)లో తెలిపిన "నిర్బంధము", లేక బాలనేరస్తుల న్యాయ చట్టము 1986 సెక్షన్ 2 (జె)లో తెలిపిన నిర్బంధము లేక మెంటల్ హెల్త్ చట్టము 1987 సెక్షన్(జి)లో తెలిపిన మానసిక వైద్యశాల లేక మానసిక చికిత్సాలయములో తెలిపిన "నిర్బంధము"లో ఉన్న వ్యక్తులు, వార్షిక ఆదాయం రూ. 1,00,000 (రూ లక్షకు మించని వ్యక్తులు కూడా ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హత కలిగి ఉన్నారు. అర్హత గల వాది, ప్రతివాదులు కూడా న్యాయ సహాయం పొందవచ్చును. %ూశీషవతీవ౧ దీఎ% ధరఖాస్తు చేయు పద్ధతి: న్యాయ సహాయం కోరువారు తను కేసు యొక్క పూర్వాపరాలు, కావలసిన పరిష్కారము (రిలీఫ్) వివరిసూ అఫిడవిడ్ ను సంబంధిత డాక్యుమెంటులను జత చేసూ దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దరఖాస్తుదారులు పైన తెలిపిన అర్హతలలో ఏవి కలిగి ఉన్నదీ తెలియపరుస్తూ తగిన ఆధారాలను (వీలైనంతమేరకు) పంపిన ఎడల నిబంధనల మేరకు తగు చర్య తీసుకోవడం జరుగుతుంది. దరఖాస్తు చేయవలసిన చిరునామా: ఉచిత న్యాయ సహాయము కోరువారు తమ తమ జిల్లాలకు చెందిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థలకు గాని, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు గానీ తమ కేసుల వివరములను తెలుపుతూ దరఖాస్తు చేసుకొనవచ్చును. %శీబ మీఘఎూశ్రీంశీ ాఊఅనివ% " రెండో పెళ్లికి రెడీ.. సమంత సంచలన పోస్ట్" జిల్లా స్థాయిలో అయితే... కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంబంధిత జిల్లా కోర్టు భవనములు రాష్ట స్థాయిలో అయితే... సభ్య కార్యదర్శి,తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, 2వ అంతస్తు, న్యాయసేవా సదన్, సిటిసివిల్ కోర్టు భవనములు, పూరానీహవేలి, హైదరాబాద్ - 500 002. లేదా హైకోర్టులో.. హైదరాబాద్ హైకోర్టులో గల కేసుల యందు న్యాయ సహాయం కోరువారు క్రింది చిరునామాకు దరఖాస్తు చేసుకోచ్చును. కార్యదర్శి,హైకోర్టు న్యాయ సేవాధికార సంఘం, హైకోర్టు భవనములు, హైదరాబాద్ - 500 066. %ూ౧జవతీఅంవవఎవత్% న్యాయ సహాయ విధానాలు : న్యాయవాదిచే ఉచితముగా న్యాయ సలహా ఇప్పించుట కేసులను పరిశీలించిన మీదట అవసరమైనచో దరఖాస్తుదారుని తరపున న్యాయవాదులను నియమించి ఆయా కోర్టులలో కేసులు చేపట్టుట. న్యాయ సహాయం పొందినవారికి కోర్టు ఫీజు, కేసుకు సంబంధించిన కోర్టు ఖర్చులు భరించుట. న్యాయ సహాయం పొందినవారికి ఆయా కేసుల్లో జడ్జిమెంట్లు నకల్లు ఉచితముగా ఇచ్చుట. మొదలగు సహాయాలు అందిస్తారు.

# డిగ్రీ ఇక రెండేళ్లే! నాలుగేళ్లూ చదవొచ్చు!!

యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల డిగ్రీ కోర్సుల కాల వ్యవధిలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. యూజీ విద్యార్థులు త్వరలో డిగ్రీ కోర్సుల వ్యవధిని తగ్గించుకునే, పొడిగించుకునే ఆప్షన్?ను పొందుతారని యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ వెల్లడించారు. యూజీ విద్యార్థులకు తమ డిగ్రీ ప్రోగ్రామ్?ల వ్యవధిని వారి అభ్యాస సామర్థ్యం ఆధారంగా తగ్గించడం లేదా పొడిగించే విధంగా ఉన్నత విద్యా సంస్థలు త్వరలో ఒక ఆప్షన్?ను తీసుకురానున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. %ూశ్రీంశీ =ఘు౧% "విద్యార్థుల కిట్ లో కీలక మార్పులు - కొత్తగా అందేవి ఇవే..!!" 'విద్యార్థులు వారి అభ్యాస సామర్థ్యాల ఆధారంగా వారి డిగ్రీ కోర్సు వ్యవధిని తగ్గించడం, పొడిగించుకునే ఆప్షన్?ను ఎంచుకోవచ్చు. యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏడీపీ) ద్వారా ప్రతి సెమిస్టర్?లో అదనపు క్రెడిట్స్?ను సంపాదించడం ద్వారా తక్కువ సమయంలో మూడు లేదా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును పూర్తి చేయవచ్చు' అని యూజీసీ ఛైర్మన్ తెలిపారు. అంతేగాక, ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఈడీపీ)తో డిగ్రీ కాలవ్యవధిని పెంచుకోవచ్చు. ప్రతి సెమిస్టర్?లో తక్కువ క్రెడిట్స్ వచ్చినవారు ఈ ఆప్షన్?ను ఎంచుకోవచ్చు. ఏడీపీ, ఈడీపీ ప్రోగ్రామ్?లకు విద్యార్థుల అర్హతను అంచనా వేయడానికి ఉన్నత విద్యాసంస్థలు కమిటీలను ఏర్పాటు చేస్తాయి. ఈ డిగ్రీలతో అన్ని ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. సాధారణ డిగ్రీల్లానే వీటికి విలువ ఉంటుంది' అని యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ స్పష్టం చేశారు. అయితే, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు మొదటి లేదా రెండో





సెమిస్టర్ చివరలో ఏడీపీని ఎంచుకునే అవకాశం ఉంటుందని యూజీసీ ఛైర్మన్ తెలిపారు. ఆ తర్వాత ఏడీపీ ప్రోగ్రాం?ను ఎంచుకోలేర న్నారు. ఏడీపీని ఎంచుకునే విద్యార్థులు ప్రతి సెమిస్టర్‌లో అదనపు క్రెడిట్‌లను పొందాలన్నారు. విద్యార్థులు మొదటి సెమిస్టర్ తర్వాత ఏడీపీలో చేరినట్లయితే.. రెండో సెమిస్టర్ నుంచి అదనపు క్రెడిట్స్?ను సాధించాలి. రెండో సెమిస్టర్ తర్వాత ఏడీపీలో చేరినట్లయితే, మూడో సెమిస్టర్ నుంచి అదనపు క్రెడిట్?ను సాధించాల్సి ఉంటుంది. 3 లేదా 4 ఏళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్?లో కోర్సును గరిష్ఠంగా రెండు సెమిస్టర్ల వరకు పొడిగించుకోవచ్చు అని యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ వివరించారు. విద్యాసంస్థలు ఎంచుకున్న వ్యవధిలో డిగ్రీ ప్రోగ్రామ్ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు అందించవచ్చని జగదీశ్ కుమార్ తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ కోసం కోర్సు పూర్తి కాలం వేచి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే వేగవంతమైన, పొడిగించిన డిగ్రీల కోసం విద్యార్థి స్వీయ నియంత్రిత నోటు రాయాల్సి ఉంటుందని యూజీసీ ఛైర్మన్ వెల్లడించారు.

### తెలంగాణలోని ఈ రైలు ప్రాజెక్టులకు

# గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి



కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కేవలం కాజీపేట వాసుల కల మాత్రమే కాదని, యావత్ తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమని, దాన్ని సాకారం చేయడంలో కేంద్రం ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ఎంపీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని గుర్తుచేస్తూ ఆ తర్వాత సైతం కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోరుతూ తాను లేఖ రాశానని చెప్పారు. "రైతుకు సంకెళ్లా?: సీఎం రేవంత్ సీరియస్ వార్నింగ్ " అలాగే, వికారాబాద్ - కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని, తద్వారా ఇరు ప్రాంతాల మధ్య రావాణాకు 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుం దని సీఎం రేవంత్ చెప్పారు. ఆ మార్గం నిర్మిస్తే దక్షిణ తెలంగాణలో మారుమూల వెనుకబడిన పరిగి, కొడంగల్ తదితర ప్రాంతాలన్నీ సిమెంట్ క్లస్టర్, ఇతర పరిశ్రమలు అభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు. కల్వకుర్తి-మాచర్ల మధ్య నూతన రైలు మార్గం మంజూరు చేయాలని సీఎం కోరారు. కల్వకుర్తి నుంచి వంగూరు-కందుకూరు-దేవరకొండ-చలకుర్తి-తిరుమలగిరి మీదుగా మాచర్ల వరకు తాము ప్రతిపాదించే నూతన మార్గం ప్రతిపాదిత గద్వాల-డోర్నకల్, ఇప్పటికే ఉన్న మాచర్ల మార్గాలను అనుసంధానిస్తుందని సీఎం రేవంత్ వివరించారు. ఈ మార్గంతో సికింద్రాబాద్, గుంటూరు, డోన్ స్టేషన్ల మధ్య అనుసంధానత కలిగి శ్రీశైలం వెళ్లే భక్తుల సులభతర ప్రయాణానికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. డోర్నకల్-మిర్యాలగూడ (పాపటపల్లి- జాన్ పహాడ్), డోర్నకల్-గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# డొనాల్డ్ ట్రంప్‌కు అరుదైన అవకాశం

ఇటీవలే ముగిసిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్.. ఇక ప్రమాణ స్వీకారానికి సమాయాత్తమౌతోన్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా జనవరి 20వ తేదీన అధ్యక్షుడిగా ప్రమాణం చేయనున్నారు. ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ ప్రమాణం చేస్తారు. మొన్నటి ఎన్నికల్లో 312 ఎలక్టోరల్ ఓట్లతో సునామీ సృష్టించారు డొనాల్డ్ ట్రంప్. 49.9 శాతం ఓట్లతో అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఆయనకు పోల్ అయిన మొత్తం ఓర్ల సంఖ్య ఏడు కోట్లను దాటింది. 7,72,68,289గా లెక్క తేలింది. ఈ ఎన్నికలను ట్రంప్ ఏకపక్షంగా మార్చివేశారు తన ఛరిష్మాతో.డొనాల్డ్ ట్రంప్ ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌కు పడ్డ ఓట్ల శాతం 48.4. మొత్తంగా 7,49,82,822 ఓట్లకే ఆమె పరిమితం కావాల్సి వచ్చింది. 2019 నాటి ఎన్నికల్లో డెమోక్రాట్లకు పట్టం కట్టిన కొన్ని కీలక రాష్ట్రాలు ఈ దఫా స్వింగ్ అయ్యాయి. రిపబ్లికన్ల వైపు మొగ్గు చూపాయి. ఈ స్థాయిలో ఘన విజయాన్ని సాధించిన డొనాల్డ్ ట్రంప్‌ను పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2024గా ఎంపిక చేసింది ప్రతిష్ఠాత్మక టైమ్ మేగజైన్. ఈ అరుదైన గుర్తింపును పొందడం ఆయనకు ఇది రెండోసారి. 2016లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినందుకు అప్పుడు కూడా పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యారు. ఈ ఏడాది ఈ అవార్డ్ కోసం 10 మంది పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది. డొనాల్డ్ ట్రంప్‌తో



పాటు కమలా హ్యారిస్, కేట్ మిడిల్టన్, ఎలాన్ మస్క్, బెంజమినె నెతన్యాహు, మార్క్ జుకర్‌బర్గ్, యులియా నవాల్నాయా, జెరోమ్ పావెల్, జో రొగాన్, క్లాడియా షెన్‌బామ్ పేర్లను తుది పరిశీలనకు తీసుకుంది. వారిలో ట్రంప్‌ను ఎంపిక చేసింది. "ఈనెల 11న నక్క తోక తొక్కిన రాశులు.. 2025 వరకు తిరుగులేదు" గత ఏడాది అమెరికన్ పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్.. ఈ ఘనతను సాధించారు. 2020లో అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌ను ఎంపిక చేసింది టైమ్ మేగజైన్. అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఉదయం ప్రారంభం అయ్యే న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ ఓపెనింగ్ బెల్‌ను సైతం ట్రంప్ మోగించనున్నారు.

### సిరియా మరణ శాసనం రాసిన

# రెబెల్ గ్రూపులు ఇవే..!!

సిరియాలో కొద్దిరోజుల కిందట ఆరంభమైన అంతర్యుద్ధం పతాక స్థాయికి చేరుకుంది. అక్కడి వేర్పాటువాదులు, తిరుగుబాటుదారులు, మిలీషియా గ్రూపులు ఉమ్మడిగా అక్కడి ప్రభుత్వాన్ని కూలగొట్టారు. రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో దేశాధ్యక్షుడు బషర్ అల్- అస్సాద్ దేశం విడిచి పారిపోయారు. ఇప్పటివరకు ఆయన ఆచూకీ తెలియరావట్లేదు. ఇరాక్‌కు పారిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. కుటుంబ సభ్యులతో కలిసి సిరియా ఉత్తర ప్రాంతం మీదుగా సరిహద్దులను దాటుకుని ఉంటాడని చెబుతున్నారు. %ూశ్రీంశీ =ఝుం% " రెండో పెళ్లికి రెడీ.. సమంత సంచలన పోస్ట్" ఆయన రష్యాకు వెళ్లి ఉండొచ్చంటూ వార్తలు వస్తోన్నాయి. రష్యాతో సుదీర్ఘకాలంగా మిత్రత్వాన్ని కొనసాగిస్తూ వస్తోన్నారు అల్-అస్సాద్. తిరుగుబాటుదారులు హామ్స్ నగరాన్ని సొంతం చేసుకున్న వెంటనే ఆయన అప్రమత్తం అయ్యారని, వైమానిక దళానికి చెందిన ఎయిర్ క్రాఫ్ట్‌లో మాస్కోకు తరలి వెళ్లారని అంటున్నారు. బషర్ అల్-అస్సాద్ కుటుంబం 50 సంవత్సరాల పాటు సిరియాను పరిపాలించింది. 1971 నుంచి 1999 వరకు బషర్ తండ్రి హాఫెజ్ అల్-అస్సాద్ దేశాధ్యక్షుడిగా వ్యవహించారు. 29 సంవత్సరాల పాటు ఆయన ఏలుబడిలో సాగింది సిరియా. 2000 నుంచి ఇప్పటివరకు బషర్ పరిపాలన సాగిస్తోన్నారు. చివరికి ఆయన ప్రభుత్వం పతనం అయింది. కొద్దిరోజులుగా సిరియాలో అంతర్యుద్ధం రాజుకున్న విషయం తెలిసిందే. తిరుగుబాటుదారులు ఒక్కో నగరాన్నీ ఆక్రమించుకుంటూ వచ్చారు. రెండో అతిపెద్ద నగరం అలెప్పోను స్వాధీనం చేసుకోవడంతోనే వారి ఆదిపత్యం స్పష్టంగా కనిపించింది. ఆ తరువాత యధేచ్ఛగా కొనసాగింది. %=వశీఎవఅనవస ఖీశీత్‌శీబ% "ఈనెల 11న నక్క తోక తొక్కిన రాశులు.. 2025 వరకు తిరుగులేదు" %ుశీషవతీవస దీఎ% రెబెల్స్ ధాటికి సనా, హామా, హామ్స్ నగరాలను కోల్పోయింది సిరియా సైన్యం. పలు రీజియన్లు ప్రభుత్వ నుంచి చేజారాయి. అవన్నీ కూడా తిరుగుబాటులదారుల నియంత్రణలోకి వెళ్లాయి. శనివారం రాత్రికి రాజధాని డమాస్కస్‌కూ చేరుకున్నాయి .

### డాక్టర్ నుంచి సిరియా అధ్యక్షుడిగా ఎదిగి,

# దేశం నుంచి పరారైన అస్సాద్..!

సిరియాలో రెబెల్స్ తో పోరాడలేక దేశం వదిలి పారిపోయిన దేశాధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ దాదాపు పాతికేళ్ల పాటు దేశాన్ని పాలించారు. డాక్టర్ గా ఉంటూ దేశాధ్యక్షుడైన ఆయన.. తనను తాను ప్రజా నాయకుడిగా మార్చుకుని ఇన్నాళ్లు సిరియాను పాలించారు. రష్యా, ఇరాన్ వంటి దేశాలకు సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్న అస్సాద్ చివరికి వాళ్లు కూడా రక్షించలేని పరిస్థితుల్లో దేశం వదిలి వెళ్లాల్సి వచ్చింది. అయితే డాక్టర్ నుంచి దేశం వదిలే వరకూ సాగిన ఆయన ప్రస్థానం ఓసారి చూద్దాం... 1994లో సిరియా అధ్యక్షుడు హాఫీజ్ అల్ అస్సాద్ కుమారుడు, బషర్ అన్న అయిన బాసిల్ ను ప్రత్యర్థులు హత్య చేశారు. దీన్ని అప్పట్లో ప్రభుత్వం కారు ప్రమాదంగా చెప్పుకుంది. అప్పట్లో లండన్ లో డాక్టర్ చదువు చదువుకుంటున్న బషర్ కు తన అన్న స్థానం భర్తీ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. అయితే వెంటనే అతను సిరియా రాలేదు. కానీ బ్రిటిష్ యువతిని పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి బషర్ తండ్రి హాఫీజ్ పాలన అంటే అంటే ఏంటో నేర్పుతూ పెంచారు. %ూశ్రీంశీ =ఝుం% " రెండో పెళ్లికి రెడీ.. సమంత సంచలన పోస్ట్" తొలుత మొండివాడిగా ఉండే బషర్..ఆ తర్వాత ప్రజల్లో కలిసిపోవడం మొదలుపెట్టారు. ఆ తర్వాత 2000లో దేశాధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. 2009 నాటికి అత్యంత ప్రజాదరణ గల నాయకుడిగా అస్సాద్ పేరు తెచ్చుకున్నారు. 68 శాతం అరబ్బులు ఆయన్ను ఆమోదించారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం మొదలుపెట్టాక పరిస్థితులు మారిపోయాయి. ఆర్థిక సంస్కరణలు ఆధునీకీకరణకు దారి తీసినా సామాజిక న్యాయాన్ని విస్మరించడంతో జనంలో అసంతృప్తి మొదలైంది. అప్పటికే ట్యునీషియా, ఈజిప్ట్, లిబియాల్లో ప్రభుత్వాలపై నిరసనలు తలెత్తాయి. ఇవి సిరియాకూ పాకాయి. వీటిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు అస్సాద్



చేసిన ప్రయత్నాలతో అంతర్యుద్ధం తలెత్తింది. అలా మొదలైన అంతర్యుద్ధంలో రెబెల్స్ కు అమెరికా మద్దతిస్తే అస్సాద్ కు రష్యా, ఇరాన్, హెజ్బొల్లా గ్రూపు మద్దతిచ్చాయి. అస్సాద్ వద్ద రసాయన అస్త్రాలు ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో ఎంట్రీ ఇచ్చిన ఐసిస్ సిరియా భూభాగాల్ని అదుపులోకి తీసుకోవడం మొదలుపెట్టింది.. 2013 తర్వాత రష్యా,ఇరాన్, హెజ్బొల్లా సాయంతో రెబెల్స్ ను అస్సాద్ అణచివేశారు. అప్పటి నుంచి రెబెల్స్ వివిధ రూపాల్లో రూపాంతరం చెంది అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది తలెత్తిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, తాజా ఇజ్రాయెల్-ఇరాన్ వార్, హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ దాడులు, రెబెల్స్ కు టర్కీ మద్దతివ్వడం వంటి పరిణామాలు అస్సాద్ కు ఇబ్బందికరంగా మారాయి. ఎవరికి వారు ప్రత్యర్థులతో యుద్ధాలతో బిజీగా ఉంటూ సిరియాలో ఉన్న అస్సాద్ ను పట్టించుకోలేకపోయాయి. ఇది చివరికి రెబెల్స్ కు వరంగా మారింది. అస్సాద్ ను దేశం నుంచి తరిమికొట్టేశారు. దీంతో ఆయన కుటుంబంతో పాటు రష్యా వెళ్లి తలదాచుకుంటున్నారు.

### భారత్ కు యుద్ధనౌక తయారు చేసి ఇచ్చిన

# బద్ధశత్రువులు రష్యా-ఉక్రెయిన్..!



అంతర్జాతీయంగా అన్ని దేశాలతో సత్సంబంధాలు నెరుపుతున్న భారత్ కు మరో గుడ్ న్యూస్. ప్రాంతీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, యుద్ధాలు చేసుకుంటున్నా పలు దేశాలు భారత్ తో మాత్రం సన్నిహిత సంబంధాలు నెరుపుతూనే ఉన్నాయి. దశాబ్దాలుగా భారత్ పై వారికి ఉన్న అచంచల విశ్వాసమే ఇందుకు నిదర్శనం. దీన్ని మరోసారి నిరూపిస్తూ ప్రస్తుతం యుద్ధంలో ఉన్న రష్యా-ఉక్రెయిన్ భారత్ కు ఓ యుద్ధ నౌక తయారు చేసి ఇచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలై రెండేళ్లు కావస్తోంది. ఈ యుద్ధం కారణంగా ఇరుదేశాలూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నాయి. అయినా యుద్ధం నుంచి మాత్రం వెనక్కి తగ్గడం లేదు. నాటో కూటమిలో ఉక్రెయిన్ కు చోటు కల్పించేందుకు పాశ్చాత్య దేశాలు వ్యూహాత్మకంగా చేస్తున్న ప్రయత్నాలకు కౌంటర్ గా రష్యా ప్రారంభించిన యుద్ధం ఇంకా కొనసాగుతోంది. దీంతో ఉక్రెయిన్ కు అవే నాటో దేశాలు యుద్ధంలో అన్ని విధాలుగా సాయం చేస్తున్నాయి. దీంతో రష్యా అధ్యక్షుడు పుతిన్ అణుదాడి సన్నద్ధతకు అవసరమైన ఆదేశాలు కూడా ఇచ్చేశారు. %ూశ్రీంశీ =ఝుం% "పాఠశాలలకు సెలవు.. భారీ వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తం" ఇలాంటి పరిస్థితుల్లో బద్ధ శత్రువులైన రష్యా, ఉక్రెయిన్ ఉమ్మడిగా ఓ కార్యక్రమం చేపట్టాయి. భారత్ కోసం ఇరుదేశాలూ కలిసి ఓ నేవీ యుద్ధ నౌకను తయారు చేసి ఇచ్చాయి. రష్యాలో తయారైన ఈ నౌకకు ఉక్రెయిన్ ఇంజన్ బిగించి ఇచ్చింది. ఈ నౌక పేరు ద ఫ్రిగేట్-ఐఎన్ఎస్ తుషీల్. 2016లో భారత్ ఇలాంటి రెండు నౌకల తయారీకి రష్యాకు ఆర్డర్ ఇచ్చింది. రష్యాకు చెందిన క్రివాక్-3 శ్రేణి యుద్ధ నౌక ఇది. అత్యాధునిక స్టెల్త్ క్షిపణి వాహక నౌక ఇది. భారత్ వద్ద ప్రస్తుతం ఉన్న ఆరు యుద్ధ నౌకలూ రష్యా తయారు చేసి ఇచ్చినవే. %ుశీషవతీవస దీఎ% రష్యాలో తయారవుతున్న ఇలాంటి రెండు యుద్ధ నౌకలతో పాటు, ఇలాంటి మరో రెండు నౌకలను భారతదేశంలో తయారు చేసేందుకు వీలుగా ఇరుదేశాలూ గతంలో ఒప్పందం చేసుకున్నాయి. గోవా షిప్‌యార్డ్‌లో వీటిని తయారు చేయనున్నారు. ఈ యుద్ధనౌకల యొక్క ప్రాథమిక ఇంజన్లు, గ్యాస్ టర్బైన్లు ఉక్రెయిన్‌లో తయారు చేశారు. ఉక్రేనియన్ ఇంజిన్‌తో కూడిన రష్యన్ యుద్ధనౌక భారత్ కోసం తయారు చేసినట్లయింది. ఇరుదేశాల మధ్య భారత్ కు ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. తాజాగా మన రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ఈ నౌకను రష్యా అందజేసింది.